నేటి కందం- నేటికి అందం

యమునోత్రికి గంగోత్రికి
సుమధుర కేదారమునకు శోభామయమై
ప్రమదము నొసగెడి బదరికి
శమముగ భక్తాళి యాత్ర సాగింతు రిలన్ !!

(గంగోత్రి యమునోత్రి కేదార్ నాథ్ బదరీనాథ్ పుణ్యక్షేత్రాలను దర్శించుకునేందుకు చార్ ధామ్ యాత్ర ప్రారంభమైంది.)

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం
తెలుగు దినపత్రిక

website:www.netinijam.com   ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433   E-mail:netinijam93@gmail.com

అటు మాజీ ఇటు తాజా
అంతా భజన మోత
బలాబలం ప్రదర్శించే
భారీ సభలు జనం చేత.
ముఖ్యమంత్రి ఎవరైనా
మంచి చేస్తే మమకారం
మరచిపోయి పాలిస్తే
మంటగలుసు అధికారం

చురక

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ మంగళవారం 21-4-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:196 పేజీలు:6 వెల: రూ.1/-


## చిప్స్ నుంచి షిప్స్ వరకు.. భారత్-దక్షిణ కొరియా సంబంధాలు కొత్త దశలోకి: ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, ఏప్రిల్ 20: భారత్, దక్షిణ కొరియా మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలపడుతున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యూంగ్ మూడు రోజుల పర్యటన కోసం భారత్ వచ్చారు. ఇరు దేశాల మధ్య సోమవారం పలు ఒప్పందాలు కుదిరాయి. అనంతరం నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో ప్రధాని మో

భారత్, దక్షిణ కొరియా మధ్య సంబంధాలు కేవలం వాణిజ్యానికి మాత్రమే పరిమితం కాకుండా టెక్నాలజీ, రక్షణ, షిప్ బిల్డింగ్, ఎనర్జీ వంటి విభిన్న రంగాల్లో విస్తరిస్తున్నాయని ప్రధాని పేర్కొన్నారు.

చిప్స్ నుంచి షిప్స్ వరకు, ట్యాలెంట్ నుంచి టెక్నాలజీ వరకు, ఎంటర్ టైన్‌మెంట్ నుంచి ఎనర్జీ వరకు.. ఇలా వివిధ రంగాల్లోని అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా దక్షిణ కొరియాతో భాగస్వామ్యం చేసుకుంటున్నట్టు తెలిపారు

ప్రస్తుతం ఇరు దేశాల మధ్య సుమారు 27 బిలియన్ డాలర్లుగా ఉన్న వాణిజ్యాన్ని 2030 నాటికి 50 బిలియన్ డాలర్లకు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ప్రధాని తెలిపారు ఈ సమావేశంలో పలు కీలక ఒప్పందాలు కూడా కుదిరాయి. ముఖ్యంగా పారిశ్రామిక రంగం, టెక్నాలజీ, ఎనర్జీ, క్రిటికల్ మినరల్స్ వంటి రంగాల్లో పరస్పరం సహకరించుకునేందుకు ఇరు దేశాలు అంగీకరించాయి. అలాగే ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం కోసం రెండు దేశాలు కలిసి పనిచేస్తాయని మోదీ తెలిపారు.

## కండువా కప్పి ఆహ్వానించిన కేసీఆర్



హైదరాబాద్, ఏప్రిల్ 20:తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. అధికార కాంగ్రెస్ పార్టీకి గట్టి షాక్ తగిలింది. సీనియర్ రాజకీయ నాయకుడు, మాజీ మంత్రి జీవన్ రెడ్డి అధికారికంగా భారత రాష్ట్ర సమితి పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. బుధవారం జగిత్యాలలో బీఆర్ఎస్ నిర్వహించిన భారీ బహిరంగ సభలో ఆయన గులాబీ గూటికి చేరారు.

బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా జీవన్ రెడ్డికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఇద్దరు నేతలు వేదికపై ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. సీనియర్ నేత రాకతో అటు సభలో, ఇటు స్థానిక బీఆర్ఎస్ శ్రేణుల్లో తీవ్ర ఉత్సాహం నెలకొంది

## 20 నెలలు నా ఉసురు పోసుకున్నారు.. జగిత్యాల ప్రజా ఆశీర్వాద సభలో జీవన్ రెడ్డి భావోద్వేగం



హైదరాబాద్, ఏప్రిల్ 20:క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా ఇన్నేళ్లు కాంగ్రెస్ పార్టీలో కొనసాగానని తెలిపారు. కానీ 20 మాసాలు నా ఉసురుపో సుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతకాలం ఈ మానసిక క్షోభ భరించాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ బలోపేతానికి నాలుగు దశబ్దాలు పోరాడితే చివరకు దక్కింది ఏంటి.. నా జీవితం చివరి దశలో ఈ మానసిక్ష క్షోభ ఏంటని భావోద్వేగానికి గురయ్యారు. ఈ సమయంలో కేసీఆర్ నాకు చెయ్యిందించి అండగా ఉన్నారని తెలిపారు.

జగిత్యాలలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. కేసీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. నా ప్రజా జీవితంలో ఇది ఒక మలుపుగా భావిస్తున్నానని రెడ్డి తెలిపారు. మీ అందరి అండదండలతో ఈ స్థాయికి ఎదిగానని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ చూపెట్టిన వివక్షతో బీఆర్ఎస్ పార్టీలో చేరానని స్పష్టం చేశారు. నేనేదో ఆశించి పార్టీ మారలేదని స్పష్టం చేశారు. నాలుగు దశాబ్దాల్లో ఎన్నో పదవులు చూశానని అన్నారు. రాష్ట్రానికి పట్టిన శని వీడాలని ఉద్దేశంతోనే పార్టీలో చేరానని చెప్పారు.

బీఆర్ఎస్ ఆవిర్భావ సందర్భంలోనే కేసీఆర్ తనను పార్టీలోకి ఆహ్వానించారని జీవన్ రెడ్డి తెలిపారు. కానీ క్రమశిక్ష కలిగిన వ్యక్తిగా కాంగ్రెస్‌లోనే కొనసాగానని పేర్కొన్నారు. ఉద్యమ రథసారథిగా కేసీఆర్ తెలంగాణ సాధించారని అన్నారు. అలాంటి వ్యక్తితో పనిచేసే అవకాశం తనకు వచ్చిందని తెలిపారు.తెలంగాణ సమాచారం

కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలను ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం పక్కన పెట్టిందని జీవన్ రెడ్డి విమర్శించారు. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా కేసీఆర్ రైతుబంధు ప్రవేశపెట్టారని తెలిపారు. కానీ కాంగ్రెస్ ప్రభు త్వం రైతుబంధు ఎగ్గొట్టిందని అన్నారు. కేసీఆర్ కల్యాణలక్ష్మి పేరుతో రూ. లక్ష ఆర్థిక సాయం చేశారని తెలిపారు. అయితే కాంగ్రెస్ రూ. లక్షతో పాటు తులం బంగారం ఇస్తామన్నారని గుర్తుచేశారు. కానీ ఉన్న పథకాన్నే ఊడగొట్టే పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు. ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేయడం లేదని విమర్శించారు.

కేసీఆర్‌తో తనకు మంచి అనుబంధం ఉందని తెలిపారు. బోర్నపల్లి నిర్మాణానికి రూ.70 కోట్లు మంజూరు చేశారని పేర్కొన్నారు. జగిత్యాల జిల్లాను చేసిన ఘనత కేసీఆర్‌ది అని కొనియాడారు. కేసీఆర్ జగిత్యాలకు మెడికల్ కాలేజీ ఇచ్చారని తెలిపారు. వైద్య సేవలను విస్తరించారని పేర్కొన్నారు. గురుకుల ఆశ్రమ పాఠశాలలను ఏర్పాటు చేశారని చెప్పారు. గిరిజనులకు రిజర్వేషన్లను కూడా పెంచారని అన్నారు.

## సంగారెడ్డిలోని గడ్డపోతారం పారిశ్రామికవాడలో భారీ పేలుడు

సంగారెడ్డి, ఏప్రిల్ 20: సంగారెడ్డి జిల్లాలోని గడ్డపోతారం పారిశ్రామికవాడలో భారీ పేలుడు సంభవించింది. ఎరిత్రో ఫార్మా కంపెనీలో అకస్మాత్తుగా రియాక్టర్ పేలడంతో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. ఈ ఘటనతో పరిశ్రమ ప్రాంగణం అంతా మంటల్లో చిక్కుకోగా, దట్టమైన పొగ పరిసర ప్రాంతాలను కమ్మేసింది.

సంగారెడ్డి జిల్లాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. గడ్డపోతారం పారిశ్రామికవాడలో ఉన్న ఎరిత్రో ఫార్మా పరిశ్రమలో అకస్మాత్తుగా రియాక్టర్ పేలుడు సంభవించింది. ఈ ఘటనతో ఒక్కసారిగా మంటలు పరిసర ప్రాంతాలను ఆవరించాయి. పేలుడు తీవ్రత ఎక్కువగా ఉండటంతో సమీప ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. దట్టమైన పొగ పరిశ్రమ పరిసరాల్లో వ్యాపించింది.

సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపు చేసే ప్రయత్నాలు ప్రారంభించారు. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పలు ఫైర్ ఇంజిన్లు రంగంలోకి దిగాయి. పేలుడు కారణంగా ఎవరైనా గాయపడినారా లేదా అన్నది ఇంకా స్పష్టంగా తెలియరాలేదు.

పేలుడు ఎలా జరిగింది, రియాక్టర్‌లో ఏవైనా సాంకేతిక లోపాలున్నాయా అనే దానిపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. పరిశ్రమలో భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా? లేదా అనే అంశంపైనా కూడా విచారణ జరుగుతోంది. ఈ ఘటనతో గడ్డపోతారం పారిశ్రామికవాడలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అధికారులు ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## హోర్ముజ్‌లో భారత నౌకలపై కాల్పులు.. విచారణ చేస్తున్న ఇరాన్..

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20:హోర్ముజ్ జలసంధిలో భారత నౌకలను లక్ష్యంగా చేసుకుని కాల్పులు జరిగాయనే వార్తలపై ఇరాన్ స్పందించింది. ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించామని ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిలీ బాఘేయి తెలిపారు. భారత నౌకలపై కాల్పులు జరిపింది తమ దళాలేనా అనే అంశంపై దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు. కాల్పులు జరిగినట్టు ధ్రువీకరణ కాలేదని, అయితే ఆరోపణలు తీవ్రంగా ఉన్నందున వాటిని పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు

హోర్ముజ్ జలసంధిలో శనివారం రెండు భారత వాణిజ్య నౌకలపై ఐఆర్‌జీసీ కాల్పులు జరిపినట్టు వార్తలు వచ్చాయి. ఐఆర్‌జీసీ అనుమతి లభించిన తర్వాతే ఆ రెండు నౌకలు హోర్ముజ్‌లోకి ప్రవేశించాయి. అయినప్పటికీ వాటిపై దాడి జరిగింది. ఈ ఘటనపై సీరియస్ అయిన కేంద్ర ప్రభుత్వం భారత్‌లోని ఇరాన్ రాయబారి మహ మ్మద్ ఫతాలీకి సమన్లు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ స్పందించింది 'భారత నౌకలను మా దళాలే లక్ష్యంగా చేసుకు న్నాయా అనే అంశంపై సంబంధి త సంస్థలు విచారణ చేపట్టాయి' అని ఇస్మాయిలీ బాఘేయి తెలిపా రు. కాగా, అమెరికాతో రెండో విడత చర్చలకు సంబంధించి తమ వద్ద ఎలాంటి ప్రణాళికా లేదని ఆయన చెప్పారు. చర్చల విషయంలో అమెరికా సీరియస్‌గా లేదని అభిప్రాయపడ్డారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని పదే పదే ఉల్లంఘిస్తోందని అన్నారు.

## కాళేశ్వరం కూలిపోవడం కేసీఆర్ అవినీతికి నిదర్శనం: సీఎం రేవంత్‌రెడ్డి



జయశంకర్ భూపాలపల్లి, ఏప్రిల్ 20 : కాళేశ్వరం ప్రాజెక్టుల రీడిజైన్ పేరుతో కేసీఆర్ హయాంలో అవినీతికి పాల్పడ్డారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. కాళేశ్వరం ప్రపంచంలోనే అద్భుతమని మాజీ సీఎం కేసీఆర్ అన్నారని పేర్కొన్నారు. ఈరోజు (సోమవారం) మేడిగడ్డ బ్యారేజీను పరిశీలించి ఇరిగేషన్ క్యాంపు కార్యాలయంలో మంత్రులు, ఎన్డీఎస్ఏ నిపుణులు, ఇరిగేషన్ అధికారులతో సీఎం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎంపీ గడ్డం వంశీకృష్ణ, ఎన్డీఎస్ఏ ఛైర్మన్ అనిల్ జైన్, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సమీక్షలో అధికారులకు పలు కీలక అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు.

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల లోపాలపై ఎలా ముందుకెళ్లాలో ఓ స్పష్టత వచ్చిందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సమస్యను అర్థం చేసుకోవడమే సగం పరిష్కారమని చెప్పుకొచ్చారు. సమస్యను పూర్తిగా అర్థం చేసుకున్నాకే అధికారులు పనులు ప్రారంభించాలని ఆదేశించారు. సేకరించిన శాంపిల్స్ రిజల్ట్‌కు అనుగుణంగా పనులు చేపట్టాలని సూచించారు. ఎన్డీఎస్ఏ మార్గదర్శకాలకు అనుగుణంగా ముందుకు వెళ్లాలని సూచించారు. ప్రతీ పనిలో ఎన్డీఎస్ఏ అప్రూవల్ తీసుకుని పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావు కాదని.. కాళేశ్వర్ రావు అని అప్పటి గవర్నర్ నరసింహన్‌తో చెప్పించారని ప్రస్తావించారు. కేసీఆర్ అవినీతిని ప్రకృతే గుర్తించి మొదట బయటకు తీసిందని తెలిపారు. 2023 ఎన్నికల ముందు కాళేశ్వరం కూలిపోయిందని చెప్పుకొచ్చారు. అన్ని విషయాల్లో కాళేశ్వరం విఫలమైందని ఎన్డీఎస్ఏ రిపోర్ట్ ఇచ్చిందని పేర్కొన్నారు.

### సీబీఐ విచారణ ఎందుకు జరపలేదు..

కాళేశ్వరంపై శాసనసభలో చర్చించి సీబీఐ విచారణకు ఆదేశించామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. తొమ్మిది నెలలైనా కేంద్ర ప్రభుత్వం సీబీఐ విచారణ ఎందుకు జరిపించడం లేదని ప్రశ్నించారు. ఈ విషయంపై తమ ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశించాలని కేంద్రానికి తీర్మానం పంపిందని అన్నారు. కేసీఆర్, హరీశ్‌రావును జైల్లో వేయాలని, ఈ కేసును సీబీఐకి అప్పగించాలని కిషన్‌రెడ్డి ఆనాడు అనలేదా అని ప్రశ్నించారు. కానీ కేంద్ర ప్రభుత్వం దీనిపై నిర్లక్ష్యం వహించిందని ధ్వజమెత్తారు. అంతకుముందు సీబీఐ విచారణకు ఆదేశించాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చెప్పారని.. కానీ ఇప్పటి వరకూ చర్యలు ఎందుకు తీసుకోవట్లేదని నిలదీశారు. కాళేశ్వరం విచారణపై సీబీఐ ఎందుకు మౌనంగా ఉంది.. అని నిలదీశారు. తాము పదే పదే లేఖలు రాసినా ఎందుకు స్పందించడం లేదు.. అని ప్రశ్నల వర్షం కురిపించారు. కేసీఆర్ హయాంలో కాళేశ్వరంపై లక్షకోట్లు ఖర్చుచేసి లక్ష ఎకరాలకు సాగు నీరు ఇవ్వలేదని ధ్వజమెత్తారు. దీనిని తాము వదిలేయలేక, దీనిపై ఖర్చు చేయలేక సాంకేతిక నిపుణులతో ఇక్కడికి వచ్చామని అన్నారు.

### కాళేశ్వరం ప్రాజెక్టును రిపేర్ చేస్తాం..

కాళేశ్వరం ప్రాజెక్టును రిపేర్ చేయాలని తమ ప్రభుత్వం సంకల్పించిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. నెల రోజుల ముందే అధికారులతో, సాంకేతిక నిపుణులతో ఇవాళ సమావేశం పెట్టుకున్నామని తెలిపారు. నిజాలు భయట పడతాయని తెలిసి ఇవాళ కావాలని వాళ్లు ఓ మీటింగ్ పెట్టుకున్నారని.. అయినా వేం అనుమతులు ఇచ్చామని స్పష్టం చేశారు. హరీశ్‌రావు తెలివి ఉందని.. మాట్లాడుతున్నారో, తెలివి లేక మాట్లాడుతున్నారో తెలియదని ఎద్దేవా చేశారు. శ్రీపాద ఎల్లంపల్లి ఈ ప్రాజెక్టుకు ప్రాణవాయువు అని ఉద్ఘాటించారు. హరీశ్‌రావు నిక్కర్‌తో తిరక్కముందే ఎల్లంపల్లి ప్రాజెక్టు ఉందని విమర్శించారు. ఎల్లంపల్లి నీటితోనే రాష్ట్రంలో అత్యధిక పంటలు పండించారని ప్రస్తావించారు. కాళేశ్వరంలో దోషులను వదిలేది లేదని హెచ్చరించారు.. దోషులను శిక్షించేందుకు అవసరమైన కార్యాచరణతో ముందుకెళ్తామని స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టును కూడా ఊరికే వదలబోమని.. రిపేర్లు చేసి నీరు అందిస్తామని పేర్కొన్నారు.

### అందుకే కేసీఆర్ మీటింగ్..

అయితే కేసీఆర్ హయాంలో చేసిన బండారం బయట పడుతుందని వాళ్లు ఈరోజు మీటింగ్ పెట్టుకున్నారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. సీబీఐ విచారణ జరుపుతారని బీజేపీ వాళ్ల కాళు మొక్కించేందుకే హరీశ్‌రావు, వినోద్ రావు ఢిల్లీకి పోయారని విమర్శించారు. కాళేశ్వరంపై విచారణకు ఆదేశిస్తారని తెలిసి బీజేపీ నేతల కాళ్లు పట్టుకునేందుకు హరీశ్‌రావు ఢిల్లీకి పరుగెత్తారని విమర్శించారు. మీడియా బయటపెట్టినా వాళ్లు ఈ విషయంపై ఎలాంటి ప్రకటన ఎందుకు చేయలేదని నిలదీశారు. బీజేపీని అడ్డుపెట్టుకుని అవినీతి కేసుల నుంచి బయటపడతామంటే రాష్ట్ర ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. అవసరమైన ప్రణాళికలతో ముందుకు వెళ్తామన్నారు. హరీశ్‌రావు ఢిల్లీ రహస్య పర్యటనన మీడియా బయటపెట్టిందని తెలిపారు. హరీశ్‌రావు రహస్య పర్యటన వెనక మతలబు ఏంటో తెలంగాణ ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో ఎవరెవరిని కలిశారో హరీశ్‌రావు బయటపెట్టాలని సవాల్ విసిరారు. జడ్జిమెంట్ ప్రకటించకముందు వాదించడానికి వీలుండదని అన్నారు. మరి న్యాయవాదులను కలవడానికి వెళ్లాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు.

### తెలంగాణను సస్యశ్యామలం చేస్తాం..

గోదావరి జలాలతో ఉత్తర తెలంగాణను సస్యశ్యామలం చేయాలని 1975 లో జలగం వెంగళరావు ఆనాటి మహారాష్ట్ర సీఎంతో ఒప్పందం చేసుకున్నారని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆ తర్వాత వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో 2009లో రూ.38, 063 కోట్లతో ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును మొదలు పెట్టారని పేర్కొన్నారు. ప్రాణహిత చేవెళ్లకు రూ.11,700 కోట్లు ఖర్చు చేశారని ప్రస్తావించారు. ప్రాణహిత చేవెళ్లతో ఆర్థిక, రాజకీయ ప్రయోజనం లేదని కెసీఆర్ రిడిజైనింగ్ పేరుతో పేరు, ఊరు అంచనాలు మార్చారని ఆగ్రహించారు. అంచనాలను రూ.లక్షా 50 వేల కోట్లకు ఎందుకు పెంచారని ప్రశ్నించారు. 2016లో మొదలుపెట్టిన మేడిగడ్డను 2019లో పూర్తిచేశామని ప్రారంభించారని తెలిపారు. ఇది అద్భుతమని భ్రమలు కల్పించి 2018 ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందారని మండిపడ్డారు. 2023 లో మేడిగడ్డ కుప్పకూలిందని అన్నారు. అన్నిటిని దాచిపెట్టి 2023 ఎన్నికల్లో ప్రయోజనం పొందాలనుకున్నారని చెప్పుకొచ్చారు. ఈ ప్రాజెక్టులో సమస్యలు రాగానే 2023, నవంబర్ 1వ తేదీన ఎన్డీఎస్ఏ ప్రాథమిక రిపోర్ట్ కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే ఇచ్చిందని ప్రస్తావించారు. ఆ నివేదికను కేసీఆర్ ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ దోపిడీపై పీసీ ఘోష్ కమిటీ సంపూర్ణ నివేదిక ఇచ్చిందని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## పరీక్షల వేళ కట్టుదిట్టమైన భద్రత.. సీపీ రమేశ్ కీలక ఉత్తర్వులు

హైదరాబాద్, ఏప్రిల్ 20: సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో సైబరాబాద్ సీపీ రమేశ్ కీలక ఉత్తర్వులు జారీ చేశారు. ఇంటర్, తెలంగాణ ఓపెన్ స్కూల్స్ సొసైటీ పరీక్షల సందర్భంగా కట్టుదిట్టమైన భద్రతని పెంచుతున్నట్లు స్పష్టం చేశారు. ఏప్రిల్ 20వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ప్రత్యేక నిబంధనలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 200 మీటర్ల పరిధిలో గుమిగూడటానికి నిషేధం విధిస్తున్నట్లు సైబరాబాద్ సీపీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుంపులుగా గూడటం నిషేధమని తెలిపారు. పరీక్షా కేంద్రాల దగ్గర వందమీటర్ల పరిధిలో జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు మూసివేస్తున్నామని చెప్పుకొచ్చారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ ఉత్తర్వులు అమలు అవుతాయని వెల్లడించారు.

పోలీస్, సైనిక సిబ్బంది, హోం గార్డులకు ఈ ఉత్తర్వుల నుంచి మినహాయింపు ఉంటుందని అన్నారు. విద్యాశాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ విధులకు అనుమతి ఉంటుందని, అలాగే అంత్యక్రియల ఊరేగింపులకు మినహాయింపు ఇస్తున్నట్లు తెలిపారు.

ఈ ఉత్తర్వులు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సీపీ రమేశ్ స్పష్టం చేశారు.

## జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లోకి రావడం..హరీశ్ రావుకు ఇష్టం లేదు: ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల, ఏప్రిల్ 20: బీఆర్ఎస్ పార్టీలోని నేతలపై స్థానిక ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. సోమవారం జగిత్యాలలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీలో ముసలం మొదలైందన్నారు. ఈ రోజు జగిత్యాల వేదికగా జరుగుతున్న బీఆర్ఎస్ సభకు ఆ పార్టీ ఎమ్మెల్యే హరీశ్ రావు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్ సభ జగిత్యాలలో జరుగుతుంటే.. హరీశ్ రావుకు ఢిల్లీకి ఏం పని అని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌లోకి జీవన్ రెడ్డి రావడం.. హరీశ్ రావుకు ఇష్టం లేదన్నారు. జీవన్ రెడ్డి ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీ ఎదగదన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టు కట్టినందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, హరీశ్ రావులను ఉరి తీయాలని జీవన్ రెడ్డి అనలేదా? అని ప్రశ్నించారు. హరీశ్ రావుతో బీఆర్ఎస్‌లోని పలువురు ఎమ్మెల్యేలు మంతనాలు జరిపారని విమర్శించారు. తెలంగాణ వద్దన్న జీవన్ రెడ్డిని పార్టీలోకి ఎలా తీసుకుంటారంటూ బీఆర్ఎస్ నేతలను పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సూటిగా ప్రశ్నించారు.

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా.. తనకు సరైన ప్రాధాన్యత ఇవ్వడం లేదని జీవన్ రెడ్డి చాలా కాలంగా తీవ్ర ఆవేదనతో ఉన్నారు. ఇటీవల ఆయన ఆ పార్టీకి రాజీనామా చేశారు. బీఆర్ఎస్‌లోకి రావాలంటూ ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్.. స్వయంగా జీవన్ రెడ్డి నివాసానికి వెళ్లి ఆహ్వానించారు. అనంతరం ఎర్రవెల్లిలోని ఫాం హౌస్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో జీవన్ రెడ్డి సమావేశమయ్యారు. ఆ పార్టీలో చేరేందుకు జీవన్ రెడ్డి సుముఖత వ్యక్తం చేశారు. దీంతో ఏప్రిల్ 20వ తేదీన జగిత్యాల సభలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ ఆధ్వర్యంలో జీవన్ రెడ్డి కండువా కప్పుకోనున్నారు. ఈ నేపథ్యంలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌పై విధంగా స్పందించారు.

టి.జీవన్ రెడ్డి పార్టీలో చేరడం బీఆర్ఎస్ నేతలకు ఇష్టం లేదని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిఅన్నారు.

# మన జీవనశైలిలో ఓ భాగమైంది 'చాయ్'

## (21 ఏప్రిల్ "జాతీయ టీ దినోత్సవం" సందర్భంగా)

ప్రపంచవ్యాప్తంగా చాయ్ ప్రియులకు కొదవలేదు. చాలా మందికి తేనీరు పడందే రోజు గడవదు. తెల్లవారక ముందే టీ సుగంధం ఊరు వాడల్లో కవాతులు చేస్తున్నది. అతిథి మర్యాదలకు టీ ఒక సర్వసాధారణ పానీయం. వేడి వేడి తేనీరు లేదా టీ రుచి తగలందే దినం ప్రారంభం కాదు. ధనిక, పేద భేదం లేకుండా అందరి అమృత పానీయం చాయ్. తేయాకును నీటిలో మరిగించి కషాయంగా మార్చి చక్కెర కలిపితే గరం గరం చాయ్ రుచులు గుప్పున వ్యాపిస్తాయి, మెదడు ఉత్తేజితం అవుతూ, నాసికాపుటాలు చైతన్యం అవుతాయి. రోజుకు పదుల సార్లు టీ తాగే జనులు ఉన్నారు. ఒకరి ఏకాగ్రతను పెంచడానికి, ఒకరి నిద్ర మబ్బును తరమడానికి, ఒకరిలో శక్తిని నింపడానికి, మరొకరికి నిద్రకు ఉపక్రమించడానికి తేనీరు ఉపయోగపడుతున్నది. తేనీరు మన జీవన విధానంలో ఒక అవిభాజ్య భాగం అయ్యింది. చాయ్ అలవాటు లేని వారు అతి తక్కువ. తేనీరు ప్రాధాన్యాన్ని అవగాహన చేసుకునేందుకు ప్రతి ఏటా 21 ఏప్రిల్ రోజున క్వీన్ ఎలిజబెత్ జన్మదినం సందర్భంగా "జాతీయ తేనీరు దినోత్సవం (నేషనల్ టీ డే)" పాటించుట 2016 నుంచి ఆనవాయితీగా మారింది. 2026 జాతీయ టీ దినోత్సవ ఇతివృత్తంగా "అధికంగా మరుగబెట్టడం – అధికంగా వాడడం (బ్రివ్ మోర్, డూ మోర్)" అనే అంశాన్ని తీసుకున్నారు.

### ప్రపంచ టీ చరిత్ర:

భారతదేశానికి టీని పరిచయం చేసిన ఘనత 'రాబర్ట్ ఫార్చ్యూన్'కు దక్కుతుంది. భారతీయుల జీవనశైలిలో సహితం ఒక భాగమైన చాయ్ పానీయం బలహీనతగా కూడా మారిపోయింది. తేన్చుకున్నా చైనా మాండరిన్ భాషలో 'చా' అంటారు. అలాగే పార్సీలో 'చాయే' అని అంటారు. వీటి నుంచే 'చాయ్' అనే పదం వచ్చి ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. అరాబిక్‌లో 'షా' అని, రష్యన్ భాషలో 'చాయే' అని, స్వాహిలిలో 'చాయ్' అని పిలుస్తారు. పలు ప్రాంతాల్లో 'టీ' అని పిలుస్తారు. టీ తాగడం ఒక అలవాటుగా కూడా మారకపోవడం చూస్తున్నాం. 'కామెల్లియా సినెన్సిస్' అనే పేరుగల చెట్టు ఆకులను ఎండబెట్టి పొడి చేసి నీటిలో వేసి మరిగిస్తే గరం గరం సుగంధ పానీయం 'చాయ్' తయారు అవుతుంది. క్రీ పూ 59లో చైనాలో నమోదు అయిన టీ పానీయం వేగంగా ప్రపంచంలో విస్తరించింది. చైనా వైద్యుడు 'హూడా టువో' తొలిసారి తన రచనలో టీ ప్రస్తావన తీసుకువచ్చారు. 16వ శతాబ్దంలో పోర్చుగీస్‌లో, 17వ శతాబ్దంలో బ్రిటీష్‌లో టీ తాగడం ఒక ఫ్యాషన్ అయ్యింది. తర్వాత బ్రిటీస్ వలస పాలనలో భారత్‌లోకి టీ ప్రవేశించడం, ప్రజలకు అలవాటుగా మారడం జరిగింది.

### భారత్‌లో టీ రకాలు:

రసాయన పరంగా టీ పొడిలో దాదాపు 3 శాతం కెఫీన్ ఉంటుంది. కెఫీన్‌తో పాటు టీలో పాలిఫినాల్స్, థియోబ్రోమిన్, థియోఫిలిన్ అనే క్లాంథైన్, ఉత్ప్రేరకాలు తక్కువ పరిమాణంలో ఉంటాయి. టీలో ఉన్న కెఫీన్ రసాయనం వల్ల చురుకుదనం పెరగడం జరుగుతుంది. తేనీరు పలు రకాలుగా ఉంటుంది. వీటిలో బ్లాక్, గ్రీన్, ఓలాంగ్, వైట, డార్క్, యెల్లో టీలు అతి ముఖ్యమైనవి. ప్రాంతీయంగా మట్కా, మసాలా, బెల్లం, ఎర్ల్ గ్రే, హర్బల్, పుయర్, ఫ్లేవర్డ్ టీ లాంటివని కూడా ఉంటాయి. సామరస్యం, గౌరవం, స్వచ్ఛత, ప్రశాంతత అనే నాలుగు సూత్రాల మీద ఆధారపడి ఉంటుంది.

### టీ క్యాపిటల్ ఆఫ్ ఇండియా – అస్సాం:

డిబ్రుగఢ్‌ను "భారత టీ నగరం"గా, అస్సాంను "భారతదేశ టీ కేపిటల్"గా వ్యవహరిస్తారు. మొదట చేదుగా, తర్వాత తీపిగా. అంతిమంగా నోటిలో చాలా సేపు నిలిచిపోయే రుచిని టీ అందిస్తుంది. భారత్‌లో తొలిసారి 1839లో అస్సాం టీ కంపెనీ ప్రారంభం అయ్యింది. భారత్‌లో అత్యధికంగా అస్సాం, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, కర్నాటక లాంటి రాష్ట్రాలు టీ ఉత్పత్తిలో ముందున్నారు. మన వంటింటి అత్యవసర పానీయంగా టీ పేరు అత్యంత ప్రజాదరణ పొందింది. మనం నిత్యం అధిక మొత్తంలో లేదా ఎక్కువ సార్లు టీ తాగకుండా కొన్ని పరిమితులు విధించుకొండి.

"చాయ్ వాలా" అనబడే సాధారణ పదంతో మన ప్రధాని నరేంద్ర మోదీ జీవితానికి విడదీయరాని సంబంధం ఉన్నది. టీ చప్పరిస్తూ బాతాకానీ కొట్టడం, ఒప్పందాలు చేసుకోవడం, స్నేహితులను పెంచుకోవడం, ప్రపంచ ముచ్చట్లను చర్చించడం, టీ కొట్టు పెద్ద రచ్చబండ కావడం లాంటి ప్రయోజనాలు కలుగుతాయి.



-మధుపాళీ
9949700037

# దేశ అన్వేషణ వ్యవస్థను బలోపేతం చేసేందుకు సముద్ర మంథన్ ద్వారా డేటా ఆధారిత అన్వేషణ సదస్సును నిర్వహించిన కేంద్రం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20:భారతదేశ విస్తృత చమురు అన్వేషణ లక్ష్యాలను సాధించడంలో భాగంగా 'సముద్ర మంథన్–నేషనల్ ఆఫ్‌షోర్ మిషన్' కింద డేటా వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా అన్వేషణ ఫలితాలను వేగవంతం చేసేందుకు.. పరిశ్రమలను భాగస్వాములను చేసేందుకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ హైడ్రోకార్బన్ (డీజీహెచ్) ఆధ్వర్యంలో "డేటా డ్రివెన్ ఎక్స్‌పోరేషన్" అంశంపై ఒక సమావేశాన్ని నిర్వహించింది.

పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ కార్యదర్శి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మంత్రిత్వ శాఖ ప్రతినిధులు, డీజీహెచ్, జాతీయ చమురు సంస్థలు, సుమారు 80 మందికి పైగా సభ్యులు పాల్గొన్నారు. ఇందులో బీపీ, ఎక్సాన్ మొబిల్, షెల్ వంటి అంతర్జాతీయ అన్వేషణ, ఉత్పత్తి సంస్థలతో పాటు రిలయన్స్ ఇండస్ట్రీస్, కెయిర్న్ ఇండియా, ఇన్వెనిరే ఎనర్జీ, అదానీ వెల్స్‌పన్ అన్వేషణ వంటి ప్రైవేటు ఆపరేటర్లు కూడా భాగస్వాములయ్యారు. వీరితో పాటు టీజీఎస్, విరిడియన్, షీర్‌వాటర్ జియోసర్వీసెస్, ఎస్‌ఎల్‌బీ, వేవ్ జియో సర్వీసెస్ వంటి ప్రముఖ భూకంప సంబంధిత సమాచారాన్ని అందించే విభాగాలు, సాంకేతిక సంస్థలు కూడా పాల్గొన్నాయి. సముద్ర తీరానికి దూరంగా, ఇంకా అన్వేషించని కొత్త ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి సారించిన ఈ సమావేశం... అన్వేషణ ఫలితాలను సాధించడంలో భూకంప సంబంధిత సమాచారం పోషించే పాత్రపై పరిశ్రమ వర్గాలను భాగస్వామ్యం చేయడమే లక్ష్యంగా సాగింది.

పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి శ్రీ హర్దీప్ సింగ్ పూరి తన సామాజిక ఖాతా ఎక్స్ పోస్టులో.. భారత్ ఇకపై గుడ్డిగా చేసే అన్వేషణల దశను దాటిందని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశం సాహసోపేతమైన మల్టీ–క్లయింట్ నమూనాను అవలంబిస్తోందని, ఇది మరింత మంది నిపుణులు సమాచారాన్ని విశ్లేషించడానికి, ఆవిష్కరణలు చేయడానికి, కొత్త నిక్షేపాలను కనుగొనడానికి వీలు కల్పిస్తుందని ఆయన తెలిపారు. దీని ద్వారా అన్వేషణ, ఉత్పత్తి రంగాన్ని కేవలం ఒక అనిశ్చితి కలిగిన రంగంగా చూసే దృక్పథాన్ని నిర్ణయాత్మకంగా మారుస్తున్నట్లు వెల్లడించారు.

సముద్ర మంథన్ ద్వారా ఇంధన రంగంలో ఆత్మనిర్భరత సాధించాలనే మన అన్వేషణను నెరవేర్చడానికి... పారదర్శకత, సహకారం, అత్యాధునిక విజ్ఞానంతో దేశపు అపారమైన సముద్ర తీర సామర్థ్యాన్ని వెలికితీస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

భూకంప సంబంధిత సమాచార లభ్యత, నాణ్యత, అందరికీ అందుబాటులో ఉండటం అనేవి నేరుగా అన్వేషణ ఫలితాలను నిర్ణయిస్తాయని పరిశ్రమ వర్గాలన్నీ స్పష్టంగా ఏకీభవించాయి.

ముఖ్యంగా కొత్త ప్రాంతాలు, లోతైన సముద్ర గర్భ బేసిన్లలో డేటా కవరేజీ సరిగ్గా లేకపోవడం వల్ల... ఆయా ప్రాంతాల్లో ఉన్న అవకాశాలను గుర్తించడం, పెట్టుబడులు, అన్వేషణ వేగం గణనీయంగా తగ్గుతున్నాయని పాల్గొన్న సభ్యులు తెలిపారు.

ఇమేజింగ్ సాంకేతికతలో వస్తున్న మార్పులు, కృత్రిమ మేధ ఆధారిత విశ్లేషణలను ఉపయోగించి, పాత డేటా సెట్‌లను మళ్లీ ప్రాసెస్ చేయడం, కొత్త కోణంలో విశ్లేషించడం ద్వారా అపారమైన విలువను వెలికితీయవచ్చని వివరించారు.

డేటా సేకరణను వేగవంతం చేయాల్సిన అవసరం

రాబోయే లైసెన్సింగ్ రౌండ్లకు అనుగుణంగా, లక్ష్యంతో కూడిన, వేగవంతమైన భూకంప సమాచార సేకరణ అవసరమని పాల్గొన్న సభ్యులు చెప్పారు. డేటాను ముందుగానే సేకరించి పటిష్టం చేయడం వల్ల సంస్థల భాగస్వామ్యం, పెట్టుబడి ఫలితాలు గణనీయంగా మెరుగుపడతాయని అంతర్జాతీయ అనుభవాలు చెబుతున్నాయి.

వేగవంతం చేసే సాధనాలుగా మల్టీ–క్లయింట్ భూకంప నమూనాలు (ఎంసీఎం):

వ్యయ సామర్థ్యాన్ని పెంచడానికి, ముఖ్యంగా కొత్త ప్రాంతాల్లో అందరి భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి మల్టీ–క్లయింట్ భూకంప నమూనాలు ఒక శక్తిమంతమైన మార్గమని గుర్తించారు.

అంతర్జాతీయ అనుభవాల ప్రకారం ఈ నమూనా ద్వారా డేటా వేగంగా అందుబాటులోకి రావడమే కాకుండా, లైసెన్సింగ్ ప్రక్రియలో ఎక్కువ మంది పాల్గొనేలా ప్రోత్సహిస్తుంది.

అదే సమయంలో దేశంలోని బేసిన్ల పరిణతిని, ప్రస్తుతం ఉన్న డేటా యాజమాన్య పద్ధతులను దృష్టిలో ఉంచుకుని ఈ విధానాన్ని దశలవారీగా, ఆచితూచి అమలు చేయాల్సిన అవసరం ఉంది.

కీలక సహాయకారిగా ప్రభుత్వం..

డేటా వ్యవస్థను బలోపేతం చేయడంలో ప్రభుత్వ పాత్ర చాలా కీలకమని ఈ సమావేశం తెలిపింది. ముఖ్యంగా విధానపరమైన మద్దతు, డేటా సేకరణలో నిరంతర పెట్టుబడులు, నేషనల్ డేటా రిపోజిటరీ (ఎన్‌డీఆర్) వంటి సమాచార అందుబాటు విధానాలను బలోపేతం చేయడంపై చర్చించారు. పరిశ్రమ వర్గాల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వ విధానాలలో స్పష్టత, ముందస్తు అంచనా వేయగలిగేలా ఉండటం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు.

సేకరణ, అమలు విధానాలు

భవిష్యత్తులో జరగబోయే భారీ స్థాయి కార్యకలాపాలను దృష్టిలో ఉంచుకుని బలమైన కొనుగోలు విధానాలు ఉండాలని సభ్యులు సూచించారు. నాణ్యమైన డేటా సేకరణ, సమయానికి పనులు పూర్తి చేయడం కోసం కేవలం తక్కువ ధరకే కాకుండా నాణ్యతతోపాటు ఖర్చుకు కూడా ప్రాధాన్యత ఇచ్చే పద్ధతులను అనుసరించాలని, అలాగే ఎక్కువ మంది సేవా సంస్థలతో కలిసి పనిచేయాలని సూచించారు.

చర్చల ఆధారంగా చేసిన ప్రతిపాదనలు

రాబోయే బిడ్డింగ్ రౌండ్లకు అనుగుణంగా, ముఖ్యంగా కొత్త ప్రాంతాలు, లోతైన సముద్ర బేసిన్లపై దృష్టి సారిస్తూ... ప్రాధాన్యత క్రమంలో భూకంప సమాచారసేకరణ ప్రణాళికను ఖరారు చేయడం.

తక్షణ అన్వేషణ ఫలితాలను సాధించడం కోసం ప్రస్తుతం ఉన్న డేటా సెట్‌లను మళ్లీ విశ్లేషించడానికి, అనుసంధానించడానికి ఒక క్రమబద్ధమైన కార్యక్రమాన్ని ప్రారంభించడం.

డేటా సేకరణ కోసం వాణిజ్య విధానాలను రూపొందించడం. ఇందులో అవసరాన్ని బట్టి మల్టీ–క్లయింట్, హైబ్రిడ్ నమూనాలను ఎంపిక చేసిన ప్రాంతాల్లో అమలు చేయడం.

భారీ స్థాయి పనులకు తగ్గట్లుగా కొనుగోలు, అమలు విధానాలను రూపొందించడం. ఇందులో నాణ్యత ఆధారిత మూల్యాంకనానికి చోటు కల్పిస్తూ.. ఎక్కువ మంది సేవా సంస్థలు పాల్గొనేలా వీలు కల్పించడం.

డేటా ఆధారిత అన్వేషణ సదస్సు ముఖ్యంగా కొత్త ప్రాంతాల్లో, లోతైన సముద్ర గర్భ బేసిన్లలో పెట్టుబడులను ఆకర్షించడానికి, అన్వేషణను వేగవంతం చేయడానికి భూకంప సమాచారమే పునాది. డేటా నాణ్యతను, అందుబాటు, వాణిజ్య సాధ్యాసాధ్యాలను మెరుగుపరచడానికి ఒక నిర్దిష్ట కాలపరిమితితో కూడిన లక్ష్యంతో ముందుకు సాగాలని పరిశ్రమ వర్గాలన్నీ ఏకగ్రీవంగా అంగీకరించాయి.

ఈ సమావేశం ద్వారా వ్యక్తమైన ఏకాభిప్రాయాన్ని ఇప్పుడు ఆచరణలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని సూచించారు. ఇందులో భాగంగా... ప్రాధాన్యత క్రమంలో డేటా సేకరణ ప్రణాళికను ఖరారు చేయడం, సరైన వాణిజ్య నమూనాలను అభివృద్ధి చేయడం, పనుల పరిమాణం, నాణ్యతకు అనుగుణంగా కొనుగోలు విధానాలను రూపొందించడం వంటి కీలక అంశాలపై తక్షణమే దృష్టి సారించాల్సి ఉంది.

## పోషణ్ పఖ్వాడా-2026లో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో పోషకాహార అవగాహనపై నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ప్రీ-స్కూల్ పిల్లలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20:పోషణ్ పఖ్వాడా వేడుకల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా, ఒంగోలులో పోషకారంపై అవగాహన కల్పించేలా ప్రీ-స్కూల్ పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలను నిర్వహించారు.

చిన్న వయసు నుంచే పిల్లల్లో ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పెంపొందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తాజా కూరగాయలు తినటం వల్ల కలిగే ప్రయోజనాలను, నిల్వ పదార్థాల వల్ల కలిగే ఆరోగ్య సమస్యలను వివరిస్తూ చిన్నారులు కీలక సందేశాలను అందించారు.

సమతుల్య ఆహారం, సహజమైన, ఆరోగ్యకరమైన ఆహార ప్రాముఖ్యతపై వివిధ రకాల కార్యక్రమాలు, పరస్పర చర్చల ద్వారా పిల్లలకున్న అవగాహనను చాటుకున్నారు. పిల్లల్లో ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పెంపొందించటంలో సంరక్షకులను, సమాజాన్ని భాగస్వాములుగా చేయటం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం.

క్షేత్రస్థాయిలో పోషకాహారంతో కలిగే ఫలితాలను మెరుగుపరచటం, ప్రవర్తనలోని మార్పును ప్రోత్సహించటం వంటి పోషణ్ పఖ్వాడా లక్ష్యాలకు అనుగుణంగా ప్రారంభ విద్యను పోషకార అవగాహనతో అనుసంధానించటానికి ఈ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు కీలక వేదికగా నిలిచాయి.దేశవ్యాప్తంగా పిల్లలు, మహిళలు, కిశోర బాలికల ఆరోగ్యం, పోషకాహార స్థాయిలను మెరుగు పరిచేందుకు పోషణ్ అభియాన్ ద్వారా సామాజిక భాగస్వామ్యాన్ని, వినూత్న పద్ధతులను మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ నిరంతరం ప్రోత్సహిస్తోంది.

# మూడు రోజుల పర్యటన నిమిత్తం జర్మనీ వెళ్లనున్న రక్షణ మంత్రి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20:భారత్–జర్మనీ మధ్య వ్యూహాత్మక రక్షణ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ ఏప్రిల్ 21 నుంచి 23, 2026 వరకు జర్మనీలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా జర్మనీ రక్షణ మంత్రి శ్రీ బోరిస్ పిస్టోరియస్‌తో, ఆ దేశ ఇతర ఉన్నతాధికారులతో శ్రీ రాజ్‌నాథ్ సింగ్ చర్చిస్తారు.

రక్షణ పరిశ్రమ సహకారాన్ని పెంపొందించటం, సైనిక సంబంధాలను బలోపేతం చేయటం, సైబర్ భద్రత, కృత్రిమ మేధ, డ్రోన్ల వంటి అభివృద్ధి చెందుతున్న రంగాల్లో అవకాశాల అన్వేషణపై ఈ చర్చలు దృష్టి సారిస్తాయి. రక్షణ పరిశ్రమ సహకార రోడ్‌మ్యాప్, యూఎన్ శాంతి పరిరక్షణ కార్యకలాపాల శిక్షణలో సహకారంపై ఇరుదేశాల రక్షణ మంత్రుల సమక్షంలో ఒప్పందాలు జరిగే అవకాశముంది.

ఇరుదేశాల మధ్య కొనసాగుతున్న రక్షణ రంగంలోని సహకార చర్యలను సమీక్షించటానికి, రక్షణ పరిశ్రమల మధ్య నూతన భాగస్వామ్య అవకాశాలను గుర్తించటానికి ఈ పర్యటన తోడ్పడుతుంది. మేక్ ఇన్ ఇండియాలో భాగంగా ఉమ్మడి అభివృద్ధి, ఉత్పత్తిని ప్రోత్సహించే లక్ష్యంతో జర్మనీ రక్షణ రంగంలోని కీలక ప్రతినిధులతో శ్రీ రాజ్‌నాథ్ సింగ్ సమావేశం అవుతారు.

ఏడేళ్ల తర్వాత భారత రక్షణ మంత్రి జర్మనీలో పర్యటించటం ఇదే తొలిసారి. ఫిబ్రవరి 2019లో చివరిసారిగా, అప్పటి రక్షణ మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ జర్మనీలో పర్యటించారు. జూన్ 2023లో బోరిస్ పిస్టోరియస్ భారతదేశాన్ని సందర్శించి, శ్రీ రాజ్‌నాథ్ సింగ్‌తో సుదీర్ఘ చర్చలు జరిపారు. ప్రజాస్వామ్య విలువలు, చట్టబద్ధమైన, అంతర్జాతీయ నిబంధనలకు భారత్, జర్మనీ కట్టుబడి ఉన్నాయి. ఇరుదేశాల మధ్య బలమైన, బహుముఖ వ్యూహాత్మక భాగస్వామ్య సంబంధాలున్నాయి. కొన్నేళ్లుగా రక్షణ, భద్రతా రంగాల్లో సహకారం ఈ భాగస్వామ్యంలో కీలకంగా మారింది. ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయటం, ప్రాంతీయ, ప్రపంచ శాంతి, స్థిరత్వం, అభివృద్ధికి దోహదపడటమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశం.

# ఘనంగా చంద్రబాబు నాయుడు 76వ జన్మదిన వేడుకలు

## -76 కేజీల భారీ కేక్ కట్ చేసిన రాష్ట్ర మైనార్టీ న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్..
## -రక్తదాన శిబిరం, అన్నదాన కార్యక్రమాలతో సందడి..



అమరావతి, ఏప్రిల్ 20: రాష్ట్ర ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు 76 వ పుట్టినరోజు వేడుకలు నంద్యాలలో సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించరు. ఈ సంబరాల్లో రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఏవీ సుబ్బారెడ్డి, టిడిపి మాజీ రాష్ట్ర కార్యదర్శులు రామచంద్రరావు, తులసి రెడ్డి, జిల్లెల్ల శ్రీరాములు, యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్, డాక్టర్ బాబాన్ ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు.

పార్టీ శ్రేణుల మధ్య 76 కేజీల భారీ కేక్ కట్ చేశారు. యువత, పార్టీ కార్యకర్తల ఉత్సాహం మధ్య రక్తదాన శిబిరాన్ని మంత్రి ఫరూక్ ప్రారంభించారు. నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పండ్లు, బెడ్ ను పంపిణీ చేసి వారి ఆరోగ్యం గురించి ఆరా తీశారు. పేదల కోసం ప్రత్యేకంగా ప్రభుత్వ హస్పటల్ నందు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చంద్రబాబు నాయుడు నిండు నూరేళ్లు ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తూ మసీదులు, చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అపర చాణక్యుడు, విజన్ ఉన్న నాయకుడు నారా చంద్రబాబు నాయుడు 76వ వసంతంలోకి అడుగుపెట్టడం మనందరికీ గర్వకారణం అన్నారు .రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే ధ్యేయంగా ఆయన నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలోనూ, రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేయడంలోనూ ఆయనకు ఆయనే సాటి అని కొనియాడారు.

ముస్లిం మైనార్టీల అభివృద్ధికి చంద్రబాబు ఎల్లప్పుడూ పెద్దపీట వేశారన్నారు. ఆయున నాయకత్వంలో రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని . పార్టీ కార్యకర్తలే చంద్రబాబు కి కొండంత అండ అన్నారు. ఆయున ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మాజీ కౌన్సిలర్లు, వార్డు అధ్యక్షులు, వివిధ హోదాలలో ఉన్న నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## గురువు ఎప్పటికీ మర్చిపోలేని జ్ఞాపకం..

### -ఆనాటి చదువు వల్లే మేము ఉద్యోగాలు స్థిరపడ్డాము

అమరావతి, ఏప్రిల్ 20: చదువు అనేది ఎవరో దొంగలించలేని వస్తువుని అది జ్ఞాపక శక్తికి మంచి విలువైన బహుమానం ఇస్తుందని గురువులు పేర్కొన్నారు. తనకు చదువు చెప్పిన గురువుల సన్మానం చేసిన పూర్వ విద్యార్థులు తమ సంతోషాన్ని చాటుకున్న వైనం నంద్యాల మండలం రాయమాల్ పురం ప్రాథమిక పాఠశాలలో చోటు చేసుకుంది. రాయమాల్పురం పాఠశాలలో సోమవారం వార్షికోత్సవం సందర్భంగా గతంలో పనిచేసిన 1998నుంచి 2002 ఉపాధ్యాయులు సూర్యపోగు ఐజయ్య ను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానం చేశారు.

గతంలో తన వద్ద చదువుకున్న మేము ఇప్పుడు ఉన్నత స్థాయిలో ఉన్నామన్నారు. లెక్చరర్లుగా, టీచర్లుగా, పోలీసులుగా పనిచేస్తున్నారని అందుకు ఆనాడు చెప్పిన చదివే ముఖ్యమని పూర్వపు విద్యార్థులు పేర్కొనటం విశేషం.ఎస్ సీ, ఎస్ టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు వేకల సుబ్బన్న మాట్లాడుతూ 28 సంవత్సరాల క్రితం పనిచేసిన గురువును సన్మానించడం గొప్ప పరిణామమన్నారు.

పని చేసే ఉపాధ్యాయులను క్రమశిక్షణతో చదువు చెప్పి విద్యార్థులను ఉన్నత స్థాయికి తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను సమాజం తప్పక గుర్తుంచుకుంటుందని పేర్కొన్నారు. రాయమాల్పురం పాఠశాలకు మంచి ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. పాఠశాల అభివృద్ధితో పాటు ప్రజల భాగస్వామ్యంతో విద్యార్థులకు మంచి బోధన అందిస్తున్నారని తెలిపారు.

# ప్రజావాణికి 31 అర్జీలు...



సంగారెడ్డి, ఏప్రిల్20 (నేటి నిజం ప్రతినిధి)ప్రజావాణి లో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించడం పై ఆయా అధికారులు దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ పాండు అన్నారు.సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వచ్చిన అర్జీదారుల నుండి అడిషనల్ కలెక్టర్ పాండు సబ్ కలెక్టర్ ఉమా హారతి తో కలిసి ఫిర్యాదులను స్వీకరించారు.

ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఆయా అధికారులకు అందజేసి సకాలంలో పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పై ఆయా శాఖల అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ప్రజావాణికి మొత్తం 31 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, రెవిన్యూ డివిజనల్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ప్రజలు పాల్గొన్నారు.

# సంక్షేమ వసతి గృహాన్ని పరిశీలించిన ఎంఈఓ

అమరావతి, ఏప్రిల్ 20: మండలంలోని గడ్డిపల్లి లో ఉన్న బాలుర ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని సోమవారం మండల విద్యాధికారి పానుగోతు చత్రు నాయక్ పరిశీలించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఆయన వసతిగృహాల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. వసతి గృహంలోని మౌలిక సదుపాయాలను, హైజీన్, కిచెన్ రూమ్, టాయిలెట్లను, విద్యార్థుల హాజరును, సిబ్బంది హాజరు రిజిస్టర్ వివరాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ వరప్రసాద్, సిఆర్పి రాతికింది రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# గృహావసరాల ఎల్‌పీజీ సిలిండర్ల బుకింగ్‌లకు అనుగుణంగా సాధారణంగానే కొనసాగుతున్న పంపిణీ.. నిన్న డెలివరీ అయిన 53.5 లక్షలకు పైగా సిలిండర్లు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20:పశ్చిమాసియాలో మారుతున్న భౌగోళిక-రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో సమన్వయంతో కూడిన ప్రతిస్పందన చర్యల ద్వారా కీలక రంగాలలో సంసిద్ధత, కార్యకలాపాల నిరంతరాయతను నిర్ధారించడంలో కేంద్ర ప్రభుత్వం క్రియాశీలకంగా వ్యవహరిస్తోంది. ఇంధన సరఫరా, సముద్రయాన కార్యకలాపాలు, ఆ ప్రాంతంలోని భారతీయులకు అందించే మద్దతు విషయమై తీసుకుంటున్న చర్యల తాజా సమాచారం ఈ విధంగా ఉంది:

హోర్ముజ్ జలసంధి ప్రాంతంలో కొనసాగుతున్న పరిణామాల నేపథ్యంలో పెట్రోలియం ఉత్పత్తులు, ఎల్పీజీ నిరంతరాయంగా అందుబాటులో ఉండేలా చూడటానికి తీసుకుంటున్న చర్యలను పెట్రోలియం- సహజ వాయువు మంత్రిత్వ శాఖ వివరించింది. ఆ వివరాలు ఇలా ఉన్నాయి:

ప్రజా సూచనలు, పౌర అవగాహన

పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ లభ్యతను నిర్ధారించడానికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోంది. కాబట్టి ప్రజలు వీటిని కంగారుతో కొనుగోలు చేయొద్దని సూచించారు.

వదంతులను నమ్మొద్దు. సరైన సమాచారం కోసం అధికారిక ఖాతాలపై మాత్రమే ఆధారపడాలి.

ఎల్పీజీ వినియోగదారులు డిజిటల్ బుకింగ్ ప్లాట్‌ఫామ్‌లను ఉపయోగించాలని, డిస్ట్రిబ్యూటర్ల వద్దకు వెళ్లడం నివారించాలని కోరారు.

పీఎన్‌జీ, ఎలక్ట్రిక్ లేదా ఇండక్షన్ కుక్‌టాప్‌ల వంటి ప్రత్యామ్నాయ ఇంధనాలను ఉపయోగించాల్సిందిగా అందరినీ ప్రోత్సహిస్తున్నారు.

ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ప్రజలందరూ రోజువారీ వినియోగంలో ఇంధనాన్ని పొదుపు చేయడానికి తగిన చర్యలు తీసుకోవలసిందిగా కోరారు.

ప్రభుత్వ సన్నద్ధత, సరఫరా నిర్వహణ చర్యలు

ప్రస్తుత భౌగోళిక రాజకీయ పరిస్థితుల మధ్య గృహ వినియోగ ఎల్పీజీ, గృహావసరాల పీఎన్‌జీ, రవాణా సీఎన్‌జీ విషయంలో సరఫరా 100 శాతం ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

వాణిజ్య ఎల్పీజీ విషయంలో ఆసుపత్రులు, విద్యా సంస్థలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. వీటితో పాటు ఫార్మా, ఉక్కు వాహనాలు, విత్తన – వ్యవసాయ రంగాలకు కూడా ప్రాధాన్యత కల్పించారు. వలస కార్మికుల కోసం 5 కిలోల ఎఫ్‌టీఎల్ సిలిండర్ల సరఫరా 2026 మార్చి 2, 3 తేదీల్లో ఉన్న సగటు రోజువారీ సరఫరాతో పోలిస్తే రెట్టింపు అయింది.

ప్రభుత్వం ఇప్పటికే సరఫరా, డిమాండ్ రెండింటినీ సమన్వయం చేసేలా పలు హేతుబద్ధీకరణ చర్యలను అమలు చేసింది. ఇందులో చమురు శుద్ధి కేంద్రాల ఉత్పత్తిని పెంచడం.. గ్యాస్ బుకింగ్ గడువును పట్టణ ప్రాంతాల్లో 21 నుంచి 25 రోజులకు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల వరకు పొడిగించడం.. ప్రాధాన్యత కలిగిన రంగాలకు సరఫరాను నిర్ధారించడం వంటివి ఉన్నాయి.

ఎల్పీజీ డిమాండ్‌పై ఒత్తిడిని తగ్గించడానికి కిరోసిన్, బొగ్గు వంటి ప్రత్యామ్నాయ ఇంధనాలను అందుబాటులోకి తెచ్చారు.

చిన్న, మధ్య తరహా వినియోగదారులకు పంపిణీ చేసేందుకు రాష్ట్రాలకు అదనపు బొగ్గును కేటాయించాలని కోల్ ఇండియా, సింగరేణి కాలరీలను బొగ్గు మంత్రిత్వ శాఖ ఆదేశించింది.

గృహ, వాణిజ్య వినియోగదారులకు కొత్త పీఎన్‌జీ కనెక్షన్లు పొందటాన్ని సులభతరం చేయాలని రాష్ట్రాలకు సూచించారు.

అమలు, పర్యవేక్షణ చర్యలు

ఎల్పీజీ అక్రమ నిల్వ, నల్లబజారు క్రయవిక్రయాలను అరికట్టడానికి దేశవ్యాప్తంగా చర్యలు కొనసాగుతున్నాయి. 18.04.2026 నాడు దేశవ్యాప్తంగా 2400 కంటే ఎక్కువ దాడులు నిర్వహించారు.

ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థలు ఆకస్మిక తనిఖీలను మరింత ముమ్మరం చేశాయి. అవి నిన్నటివరకు 264 ఎల్పీజీ డిస్ట్రిబ్యూటర్లకు జరిమానాలు విధించటంతో పాటు 67 మంది డీలర్లను సస్పెండ్ చేశాయి.

సిలిండర్ల దారి మళ్లింపును అరికట్టడానికి డెలివరీ ఆథెంటికేషన్ కోడ్ (డీఏసీ) ఆధారిత పంపిణీ విధానాన్ని సుమారు 93 శాతానికి పెంచారు. నమోదు చేసుకున్న ఫోన్ నంబర్‌కు డీఏసీ వస్తుంది.

మొత్తం వాణిజ్య ఎల్పీజీ కేటాయింపులు సంక్షోభానికి ముందు ఉన్న స్థాయిలో సుమారు 70 శాతానికి పెరిగాయి. ఇందులో 10 శాతం సంస్కరణలతో ముడిపడి ఉన్న కేటాయింపులు కూడా ఉన్నాయి.

కేంద్ర ప్రభుత్వం 06.04.2026 నాటి లేఖ ద్వారా వలస కార్మికులకు పంపిణీ చేసే 5 కిలోల ఎఫ్‌టీఎల్ (ఫ్రీ ట్రేడ్ ఎల్పీజీ) సిలిండర్ల రోజువారీ పరిమాణాన్ని ప్రతి రాష్ట్రంలోనూ రెట్టింపు చేస్తున్నట్లు తెలియజేసింది. 21.03.2026 నాటి లేఖలో పేర్కొన్న 20 శాతం పరిమితిని మించి 2026 మార్చి 2-3 తేదీల్లో వలస కార్మికులకు సరఫరా చేసిన సగటు సిలిండర్ల సంఖ్య ఆధారంగా ఈ పెంపు ఉంటుంది. ఈ 5 కిలోల ఎఫ్‌టీఎల్ సిలిండర్లు రాష్ట్ర ప్రభుత్వం వద్ద అందుబాటులో ఉంటాయి. వీటిని చమురు మార్కెటింగ్ కంపెనీల సహకారంతో కేవలం ఆయా రాష్ట్రాల్లోని వలస కార్మికులకు మాత్రమే సరఫరా చేయాల్సి ఉంటుంది.

2026 ఏప్రిల్ 3 వరకు ప్రభుత్వ రంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు (పీఎస్‌యూ ఓఎంసీ) 5 కేజీల ఎఫ్‌టీఎల్ సిలిండర్లపై సుమారు 6700 అవగాహన శిబిరాలను నిర్వహించాయి. ఈ శిబిరాల ద్వారా 96,000 కంటే ఎక్కువ 5 కేజీల ఎఫ్‌టీఎల్ సిలిండర్లు విక్రయమయ్యాయి. నిన్న సుమారు 230 శిబిరాల ద్వారా 5233 5 కేజీల ఎఫ్‌టీఎల్ సిలిండర్లు విక్రయమయ్యాయి.

ఇటీవల 2026 ఏప్రిల్ 18న రబాలేలో (థానే) ఉన్న ఎంఐడీసీలో బీపీసీఎల్ నిర్వహించిన 5 కేజీల ఎఫ్‌టీఎల్ అవగాహన సదస్సుకు మంచి స్పందన లభించింది. ఈ శిబిరంలో 300కు పైగా 5 కేజీల ఎఫ్‌టీఎల్ సిలిండర్లు అమ్ముడయ్యాయి.

2026 మార్చి 23 నుంచి 18.33 లక్షలకు పైగా 5 కేజీల ఎఫ్‌టీఎల్ సిలిండర్లు అమ్ముడయ్యాయి.

వాణిజ్య ఎల్పీజీ పంపిణీని ప్రణాళికాబద్ధంగా నిర్వహించడానికి ఐఓసీఎల్, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్ సంస్థల కార్యనిర్వహక డైరెక్టర్లతో కూడిన ముగ్గురు సభ్యుల కమిటీ.. రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, పరిశ్రమల విభాగాలతో సమన్వయం చేసుకుంటోంది.

18.04.2026న 9,192 మెట్రిక్ టన్నుల వాణిజ్య ఎల్పీజీని (4.83 లక్షలకు పైగా 19 కేజీల సిలిండర్లకు సమానం) విక్రయించారు.

2026 మార్చి 14 నుంచి మొత్తం 1,67,775 మెట్రిక్ టన్నుల వాణిజ్య ఎల్పీజీ (88.3 లక్షలకు పైగా 19 కేజీల ఎల్పీజీ సిలిండర్లకు సమానం) విక్రయమైంది. ఇందులో 9600 మెట్రిక్ టన్నులకు పైగా ఆటో ఎల్పీజీ కూడా ఉంది.

2026 ఏప్రిల్ నెలలో (17.04.26 వరకు) పీఎస్‌యూ ఓఎంసీల ద్వారా రోజువారీ సగటు ఆటో ఎల్పీజీ విక్రయాలు సుమారు 305 మెట్రిక్ టన్నులుగా నమోదయ్యాయి. 2026 ఫిబ్రవరి నాటి రోజువారీ సగటు 177 మెట్రిక్ టన్నులుగా ఉంది.

ఆటో ఎల్పీజీ విక్రయాలు ప్రైవేట్ సంస్థల నుంచి ప్రభుత్వ రంగ (పీఎస్‌యూ) చమురు సంస్థలకు మారిన ధోరణి కనిపిస్తోంది. పెరుగుతున్న డిమాండ్‌ను తట్టుకోవడానికి పీఎస్‌యూ సంస్థల ఆటో ఎల్పీజీ విక్రయాలు 72 శాతం పెరిగాయి. ప్రధానంగా తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో ఈ భారీ వృద్ధి కనిపించింది.

కేంద్ర రహదారి రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ 24.03.26 నాటి లేఖ ద్వారా సీజీడీ మౌలిక సదుపాయాలకు సంబంధించిన దరఖాస్తులను ప్రాధాన్యతా క్రమంలో పరిశీలించటానికి 'తగ్గించిన కాలపరిమితితో సీజీడీ మౌలిక సదుపాయాలకు వేగవంతమైన ఆమోద వ్యవస్థ'ను 3 నెలల ప్రత్యేక గడువుతో అమల్లోకి తీసుకువచ్చింది.

భారత ప్రభుత్వ 24.03.2026 నాటి గెజిట్, నిత్యావసర వస్తువుల చట్టం-1955 ద్వారా సహజ వాయువు, పెట్రోలియం ఉత్పత్తుల పంపిణీ (పైప్‌లైన్లు, ఇతర సౌకర్యాల కల్పన, నిర్మాణం, నిర్వహణ, విస్తరణ) ఉత్తర్వు-2026ను జారీ చేసింది. దేశవ్యాప్తంగా పైప్‌లైన్లను వేయటానికి, విస్తరించటానికి క్రమబద్ధమైన, కాలపరిమితితో కూడిన వ్యవస్థను ఈ ఉత్తర్వు అందిస్తుంది. అనుమతులు, భూమి లభ్యతలో జాప్యాలను పరిష్కరించి, నివాస ప్రాంతాలు సహా సహజ వాయువు మౌలిక సదుపాయాల వేగవంతమైన అభివృద్ధికి ఇది వీలు కల్పిస్తుంది. ఇది పీఎన్‌జీ వ్యవస్థ వృద్ధిని వేగవంతం చేస్తుంది. ప్రతీ ప్రాంతానికి అనుసంధానాన్ని మెరుగుపరుస్తుంది. స్వచ్ఛ ఇంధన పరివర్తనకు మద్దతిస్తుంది. తద్వారా ఇంధన భద్రతను బలోపేతం చేయటంతో పాటు గ్యాస్ ఆధారిత ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహిస్తుంది.

డీ-పీఎన్‌జీ కనెక్షన్లను వేగవంతం చేయాలని సీజీడీ సంస్థలను పీఎన్‌జీఆర్‌బీ ఆదేశించింది. పీఎన్‌జీ విస్తరణ వేగాన్ని కొనసాగించటానికి, జాతీయ పీఎన్‌జీ డ్రైవ్ 2.0ను 30.06.2026 వరకు పొడగించారు.

స్వచ్ఛమైన, సురక్షితమైన, స్వావలంబన ఇంధన భవిష్యత్తును ప్రోత్సహించటానికి, రాష్ట్రాల్లో సీబీజీ విధానం కోసం నమూనా ముసాయిదాను భారత ప్రభుత్వం అభివృద్ధి చేసింది. సీబీజీ అభివృద్ధికి రాష్ట్రాలు సొంత పెట్టుబడిదారులకు అనుకూలమైన, అమలు-ఆధారిత వ్యవసను రూపొందించటానికి ఈ నమూనా విధానం ఒక సమగ్రమైన, సరళమైన మార్గదర్శక వ్యవస్థగా ఉపయోగపడుతుంది. దీన్ని ఎంచుకున్న రాష్ట్రాలకు, వాణిజ్య ఎల్పీజీ అదనపు కేటాయింపుల తదుపరి విడతలో ప్రాధాన్యతనిస్తారు.

ఎంఓఈఎఫ్‌సీసీ, 07.04.2026 నాటి ఉత్తర్వు ద్వారా సీజీడీ వ్యవస్థ మౌలిక సదుపాయాల స్థాపన, నిర్వహణకు 15 రోజుల్లోపు అనుమతి మంజూరు చేయాలని ఎస్‌పీసీబీ, పీసీసీలకు అవసరమైన ఆదేశాలను జారీ చేయాలని సీపీసీబీని ఆదేశించింది.

సీపీసీబీ ఆదేశాల ప్రకారం.. కొన్ని చమురు, గ్యాస్ రవాణా పైప్‌లైన్లు "గ్రీన్" కేటగిరీ ద్వారా వర్గీకరించారు.

"ఆటోమొబైల్ సర్వీసింగ్, రిపేరింగ్, పెయింటింగ్ అవసరం లేని ఇంధన విక్రయ కేంద్రాలు"ను ఎంఓఈఎఫ్‌సీసీ ఇప్పటికే "వైట్" కేటగిరీగా వర్గీకరించింది. సంబంధిత చట్టాల ప్రకారం స్థాపన, నిర్వహణకు పొందాల్సిన అనుమతి నుంచి వీటికి మినహాయింపు ఇచ్చింది.

మార్చి 2026 నుంచి ఇప్పటివరకు 4.85 లక్షలకు పైగా పీఎన్‌జీ కనెక్షన్లకు గ్యాస్ సరఫరాను ప్రారంభించారు. కొత్త కనెక్షన్ల కోసం 5.43 లక్షలకు పైగా వినియోగదారులు నమోదు చేసుకున్నారు.

దేశీయ మార్కెట్లో పెట్రో కెమికల్ ముడి సరకు లభ్యత పరిశీలనకు అంతర్-మంత్రిత్వ శాఖల సంయుక్త కార్యవర్గాన్ని (జేడబ్ల్యూజీ) ఏర్పాటు చేశారు. భారత ప్రభుత్వ 01.04.2026 నాటి ఉత్తర్వు ద్వారా సెంటర్ ఫర్ హై టెక్నాలజీ (సీహెచ్‌టీ) నిర్ధారించిన కీలక రంగాల కోసం ఆయిల్ రిఫైనరీలు, పెట్రో కెమికల్ కాంప్లెక్సులు కనీస పరిమాణంలో సీ3, సీ4 స్ట్రీమ్‌లను అందుబాటులో ఉంచేందుకు అనుమతించింది.

ఔషధ విభాగం, కెమికల్స్, పెట్రో కెమికల్స్ విభాగం (డీసీపీసీ), పరిశ్రమల ప్రోత్సాహక, అంతర్గత వాణిజ్య విభాగం (డీపీఐఐటీ) నుంచి అందిన అభ్యర్థనల మేరకు ఔషధ, రసాయన రంగ సంస్థలకు ఎల్పీజీ పూల్ నుంచి రోజుకు 1000 మెట్రిక్ టన్నుల సరఫరాకు వీలు కల్పించారు.

మధ్యప్రాచ్య సంక్షోభం కారణంగా ముడి చమురు ధరలు అసాధారణంగా పెరిగాయి. అయినప్పటికీ, వినియోగదారులను ఆదుకునేందుకు భారత ప్రభుత్వం.. పెట్రోల్, డీజిల్‌పై లీటరుకు రూ.10 చొప్పున ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించింది.

దేశీయ మార్కెట్లో ఈ ఉత్పత్తులు అందుబాటులో ఉండేలా చూసేందుకు భారత ప్రభుత్వ 11.04.2026 గెజిట్ నోటిఫికేషన్ ద్వారా డీజిల్‌పై ఎగుమతి సుంకాన్ని లీటరుకు రూ.55.50కి, ఏటీఎఫ్‌పై లీటరుకు రూ.42కి పెంచింది.

సాధారణ రిటైల్ పెట్రోల్, డీజిల్ ధరల్లో ఎలాంటి మార్పు లేదు. పీఎస్‌యూ ఓఎంసీల రిటైల్ షాపుల వద్ద ధరల పెంపు లేదు.

కిరోసిన్ లభ్యత, పంపిణీ చర్యలు

సాధారణ కేటాయింపులకు అదనంగా రాష్ట్రాలు, యూటీలకు 48,000 కిలోలీటర్ల కిరోసిన్‌ను కేటాయించారు.

18 రాష్ట్రాలు, యూటీల్లో ఎస్‌కేఓ కేటాయింపు ఉత్తర్వులను జారీ చేయగా.. తమకు అవసరం లేదని హిమాచల్‌ప్రదేశ్, లద్దాఖ్ తెలిపాయి.

నావికుల సంక్షేమం, సముద్రయాన కార్యకలాపాలు సాఫీగా సాగేలా చూసేందుకు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, భారత రాయబార కార్యాలయాలు, సముద్రయాన భాగస్వాములతో ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వ శాఖ నిరంతరం సమన్వయం చేసుకుంటోంది.

భారత ముడి చమురు ట్యాంకర్ దేశ్ గరిమ ఏప్రిల్ 18, 2026న హర్మూజ్ జలసంధిని సురక్షితంగా దాటింది. ఈ నౌకలో 31 మంది భారత నావికులున్నారు. ఇది ఏప్రిల్ 22, 2026న ముంబైకి చేరుతుందని అంచనా.

గత 24 గంటల్లో హర్మూజ్ జలసంధి ద్వారా ప్రయాణిస్తున్న సమయంలో వీఎల్‌సీసీ సన్మార్ హెరాల్డ్, బల్క్ క్యారియర్ జగ్ అర్నవ్ భారత నౌకల్లో కాల్పులు జరిగినట్లు నివేదిక అందింది. దీంతో అవి పర్షియన్ గల్ఫ్‌కు తిరిగి వెళ్లిపోయాయి. ఈ ఘటనలో సిబ్బంది సురక్షితంగా ఉన్నట్లు నివేదికలు తెలిపాయి.

నిన్న విదేశాంగ కార్యదర్శితో సమావేశం కోసం న్యూఢిల్లీలోని ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ రాయబారిని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పిలిపించింది. హర్మూజ్ జలసంధిలో నిన్న ఉదయం రెండు భారత నౌకలపై జరిగిన కాల్పుల ఘటనపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. వాణిజ్య నౌకలు, నావికుల భద్రతకు భారత్ ప్రాధాన్యతనిస్తున్నట్లు విదేశాంగ కార్యదర్శి తెలిపారు.

వాణిజ్య నౌకలపై జరిగిన ఈ కాల్పుల ఘటనపై ఆందోళనను తెలియజేస్తూ.. ఇరాన్‌లోని అధికారులకు భారతదేశ అభిప్రాయాలను తెలియజేయాలని, జలసంధి గుండా భారతదేశానికి వచ్చే నౌకలకు సరైన సౌకర్యాలు కల్పించాలని రాయబారిని విదేశాంగ కార్యదర్శి కోరారు.

భారత నావికులందరూ సురక్షితంగా ఉన్నారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ, సంబంధిత భాగస్వాములతో సమన్వయం చేసుకుంటూ పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నారు.

డీజీ షిప్పింగ్ కంట్రోల్ రూమ్ అప్‌డేట్: ఈ కంట్రోల్ రూమ్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు 6,893 ఫోన్ కాల్స్, 14,470కి పైగా ఈ-మెయిళ్లను పరిష్కరించింది. గత 24 గంటల్లో 66 ఫోన్ కాల్స్, 204 ఈ-మెయిల్స్ వచ్చాయి.

డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ (డీజీ షిప్పింగ్) ద్వారా మంత్రిత్వ శాఖ ఇప్పటివరకు ఇప్పటివరకు 2,538 మందికి పైగా భారత నావికులను సురక్షితంగా స్వదేశానికి తీసుకువచ్చింది. గల్ఫ్ ప్రాంతంలోని వివిధ ప్రదేశాల నుంచి గత 24 గంటల్లో 51 మంది వచ్చారు.

భారతదేశవ్యాప్తంగా ఓడరేవుల్లో కార్యకలాపాలు సాధారణంగా కొనసాగుతున్నాయి. ఎక్కడా రద్దీ ఉన్నట్లు సమాచారం అందలేదు.

గల్ఫ్, పశ్చిమాసియా ప్రాంతాల్లోని పరిణామాలను విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిరంతరం పర్యవేక్షిస్తోంది. ఈ ప్రాంతంలోని భారతీయుల భద్రత, రక్షణ, సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలో వెల్లడించిన వివరాలు:

సమాచార మార్పిడి, ప్రయత్నాలను సమన్వయం చేసుకోవటానికి రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిరంతరం సంప్రదింపులు జరుపుతోంది.

భారత రాయబార కార్యాలయాలు..,పోస్టులు ఇరవై నాలుగు గంటలూ హెల్ప్‌లైన్‌లను నిర్వహిస్తూ, భారత పౌరులకు సహాయం అందిస్తున్నాయి. అవి స్థానిక ప్రభుత్వాలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాయి.

స్థానిక ప్రభుత్వ మార్గదర్శకాలు, విమాన, ప్రయాణ పరిస్థితులు, దౌత్యపరమైన సేవలు, భారత పౌరులకు మద్దతుగా చేపడుతున్న వివిధ సంక్షేమ చర్యల తాజా సమాచారంతో క్రమం తప్పకుండా ప్రకటనలను జారీ చేస్తున్నారు.

ఈ ప్రాంతంలోని వివిధ సంఘాలు, సంస్థలు, వృత్తిపరమైన బృందాలు, భారతీయ కంపెనీలు, ఇతర భాగస్వాములతో భారత రాయబార కార్యాలయాలు నిరంతరం సంప్రదింపులు జరుపుతూ క్రియాశీలకంగా పనిచేస్తున్నాయి.

పశ్చిమాసియా ప్రాంత నౌకల్లోని భారతీయ సిబ్బందికి స్థానిక అధికారులు, ఏజెన్సీలతో సమన్వయం చేయటం, దౌత్యపరమైన సహాయం అందించటం, భారత దేశానికి తిరిగి రావాలనే అభ్యర్థనలకు సహాయం చేయడంతో సహా అన్ని రకాల సేవలను రాయబార కార్యాలయాలు అందిస్తున్నాయి.

గగనతలం అందుబాటులో ఉన్న దేశాల నుంచి విమాన సర్వీసులు కొనసాగుతున్నాయి. ఫిబ్రవరి 28 నుంచి, ఈ ప్రాంతం నుంచి భారతదేశానికి సుమారు 10,97,000 మంది ప్రయాణికులు వచ్చారు.

యూఏఈలోని విమానయాన సంస్థలు కార్యాచరణ, భద్రతాపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకుని యూఏఈ, భారత్ మధ్య పరిమిత సంఖ్యలో షెడ్యూల్ చేయని వాణిజ్య విమాన సర్వీసులు నడుస్తున్నాయి. ఈ రోజు యూఏఈ, భారత్ మధ్య సుమారు 110 విమానాలు నడుస్తాయని అంచనా.

సౌదీ అరేబియా, ఒమన్‌లోని వివిధ విమానాశ్రయాల నుంచి భారతదేశంలోని పలు నగరాలకు విమాన సర్వీసులు కొనసాగుతున్నాయి.

ఖతార్ గగనతలం పాక్షికంగా అందుబాటులో ఉండటంతో ఖతార్ ఎయిర్‌వేస్ ఈ రోజు భారతదేశానికి సుమారు 10 నుంచి 11 విమానాలను నడపాలని భావిస్తోంది.

కువైట్ గగనతలం ఇప్పటికీ అందుబాటులో లేదు.

కువైట్‌కు చెందిన జజీరా ఎయిర్‌వేస్, కువైట్ ఎయిర్‌వేస్, సౌదీ అరేబియాలోని దమ్మామ్ విమానాశ్రయం నుంచి భారతదేశానికి షెడ్యూల్ చేయని వాణిజ్య విమానాలను నడుపుతున్నాయి.

# ఇందిరమ్మ ఇండ్లతో పేదల కల సాకారం

-ఆందోల్-జోగిపేటలో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ.



సంగారెడ్డి, ఏప్రిల్ 20 (నేటి నిజం ప్రతినిధి)పేదల స్వంత ఇంటి కలను నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు.

ఆందోల్-జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు బస్వాపురంమల్లమ్మ-మల్లయ్య, విజయలక్ష్మి-జగదీశ్వర్ ల ఇందిరమ్మ ఇంటిని మంత్రి మంగళవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి వారికి శుభాకాంక్షలు తెలిపారు. స్వంత ఇల్లు కల నిజమవడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి, మంత్రి దామోదర్ రాజనర్సింహకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా,మంత్రి మాట్లాడుతూ, పేదల గృహావసరాలను తీర్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇళ్లు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గృహ నిర్మాణ కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేసి, ఎవరూ ఇల్లు లేకుండా ఉండకుండా చూడటం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.ఆందోల్ -జోగిపేటలలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం శరవేగంగా నిర్మాణం పూర్తి అవుతున్నాయన్నారు.

ఈ కార్యక్రమంలో ఆదనపు కలెక్టర్ మాధురి,మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి,

వైస్ చైర్మన్ చిట్టిబాబు, కౌన్సిలర్ రేఖ?ప్రవీణ్ కుమార్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



న్యూఢిల్లీ, ఏప్రిల్ 20: ఈరోజు నల్లగొండ జిల్లా మునుగోడు మండలం గంగోరిగూడెంలో నూతనంగా ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ దోటి నారాయణ ఆ గ్రామ సర్పంచ్ గోపగోని పాపయ్య గౌడ్ తో కలిసి ప్రారంభించారు.

ఈ సం దర్భంగా వారు మాట్లాడుతూ.. ధాన్యం రైతులకు గిట్టుబాటు ధర కల్పించి పండించిన ప్రతి గిం జను ప్రభుత్వం కొనుగోలు చేస్తు ందని అన్నారు.

ధాన్యం కొనుగోళ్ల లో దళారులకు చోటు లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఏ పి యం గోసుల భాస్కర్,ఏఈఓ మాధగోని నరసింహ గౌడ్,సి సి కోరే యాదయ్య,సి ఆర్ పి దీపిక ,వివికె బాలావతి, ఉపసర్పంచ్ రమేష్ పావని,గ్రామ శాఖ అధ్యక్షులు గోపగోని మహేష్,వార్డ్ మెంబర్లు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో పారిశుద్ధ్యం, నాణ్యమైన భోజనంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి : కలెక్టర్ ప్రతిమా సింగ్



మెదక్, ఏప్రిల్ 20:పాఠశాలల్లో పారిశుద్ధ్యం, నాణ్యమైన భోజనంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారు. 99 రోజుల ప్రజాపాలన ? ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నేటి నుంచి సంక్షేమ వారోత్సవాల నేపథ్యంలో మొదటి రోజున సంక్షేమ పాఠశాలలు, వసతి గృహాల వంట గదులు, పరిసరాలు, పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణ, ఆహార నాణ్యతపై అవగాహన కింద సోమవారం మెదక్ జిల్లా కేంద్రంలో గల మైనారిటీ బాలికల పాఠశాల, వసతి గృహాన్ని మెదక్ మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, సంబంధిత ఉపాధ్యాయునులతో కలిసి జిల్లా కలెక్టర్ సందర్శించి, ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు.

ఈ సందర్భంగా పాఠశాలలో మరుగుదొడ్లు , పారిశుద్ధ్యం మధ్యాహ్న భోజన పథకం అమలు విధానాన్ని కలెక్టర్ సమగ్రంగా తనిఖీ చేశారు. వంట విధానం, వంట తయారీ ప్రక్రియను పరిశీలించి, విద్యార్థులకు అందిస్తున్న భోజనం శుభ్రంగా, రుచికరంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. వంటకు ఉపయోగిస్తున్న పదార్థాల నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, సరుకులు నాణ్యతతో సరైన ప్రమాణాలతో ఉండాలని ఆదేశించారు. పాఠశాల పరిసరాల్లో పారిశుద్ధ్యం పరిస్థితిని పర్యవేక్షించి, ఎప్పటికప్పుడు పరిశుభ్రత పాటించాలని తెలిపారు.

అదే విధంగా పాఠశాలలో చేపట్టిన మూత్రశాలలను పరిశీలించి, మరుగుదొడ్లకు డోర్ల మరమ్మత్తుల పనులు త్వరగా పూర్తి చేయాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పని చేసి విద్యా ప్రమాణాలను పెంపొందించాలని సూచించారు. ఈ తనిఖీలో సంబంధిత ఉపాధ్యాయులు , సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# డిపోలు, యార్డులు, వర్కుషాపుల్లో ఖాళీ అయిన స్థలం: పునర్వినియోగం,

# వ్యర్థాల ఉత్పత్తిని తగ్గించడం ద్వారా పర్యావరణ హితంగా మారుతున్న రైల్వేలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20:టికెట్టు ధరలు పెంచకుండానే సుస్థిర ఆదాయ విధానాలు, స్క్రాప్ అమ్మకాలు, నిలకడగా పెరుగుతున్న ఛార్జీయేతర ఆదాయం ద్వారా భారతీయ రైల్వేలు ఆదాయ స్థిరత్వాన్ని బలోపేతం చేసుకుంటున్నాయి. అదే సమయంలో ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలను కల్పిస్తున్నాయి. నిరుపయోగంగా ఉన్న ఆస్తులను ఉపయోగించుకోవడం, ఛార్జీలపై మాత్రమే ఆధారపడకుండా.. వినూత్న ఆదాయ మార్గాలను విస్తరించడం ద్వారా సుస్థిరమైన ఆర్థిక విధానంలో స్టేషన్లలో సౌకర్యాలను, పారిశుద్ధ్యాన్ని, డిజిటల్ సేవలను, ప్రయాణికులకు వసతులను మెరుగుపరిచేలా రైల్వే చర్యలు తీసుకుంటోంది. ఆస్తుల సమర్థ నిర్వహణ, వినియోగదారు కేంద్రక పెట్టుబడులు, పర్యావరణ హితమైన పద్ధతులను ఈ సమతుల్య విధానం ప్రతిబింబిస్తోంది. అదేవిధంగా సౌకర్యవంతమైన, ఆధునికమైన, విశ్వసనీయమైన రవాణా అనుభవాన్ని అందించడంలో రైల్వేల చిత్తశుద్ధిని తెలియజేస్తుంది.

**స్క్రాప్ ద్వారా ఆదాయార్జన సామర్థ్యాన్ని సద్వినియోగం చేసుకుంటున్న రైల్వేలు**

ఆర్థిక సంవత్సరం 2025-26లో స్క్రాప్ తొలగింపులో మెరుగైన ప్రదర్శనతో భారతీయ రైల్వేలు కీలకమైన మైలురాయిని అధిగమించాయి. స్క్రాప్ అమ్మకాల్లో నిర్దేశిత రూ. 6000 కోట్ల లక్ష్యాన్ని అధిగమించి రికార్డు స్థాయిలో రూ. 6813.86 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది.

మునుపటి ఆర్థిక సంవత్సరం 2024-25లో కనబరిచిన పనితీరు ఆధారంగా ఈ విజయం సాధ్యమైంది. ఆ ఏడాదిలో స్క్రాప్ అమ్మకాల ద్వారా రూ. 5400 కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించగా రూ. 6641.78 కోట్ల విలువైన అమ్మకాలను సాధించారు.

ఆస్తుల సమర్థ నిర్వహణకు, పారదర్శకమైన తొలగింపు విషయంలో రైల్వేల అంకితభావాన్ని స్క్రాప్ ద్వారా ఆదాయాన్ని సంపాదించడంలో సాధిస్తున్న పురోగతి సూచిస్తుంది. పనికిరాని వస్తువులను క్రమపద్ధతిలో తొలగించడం ద్వారా, ఈ సంస్థ వినియోగంలో లేని ఆస్తుల నుంచి ఆదాయాన్ని రాబట్టడమే కాకుండా.. డిపోలు, యార్డులు, వర్క్ షాపుల్లో స్థలం ఖాళీ చేస్తోంది.

పునర్వినియోగాన్ని ప్రోత్సహించడం, వ్యర్థాలు పేరుకుపోవడాన్ని తగ్గించడం ద్వారా పర్యావరణ సుస్థిరతకు ఈ కార్యక్రమం గణనీయంగా దోహదపడుతుంది.

**టిక్కెటేతర ఆదాయాన్ని బలోపేతం చేసుకుంటూ.. ప్రయాణికులకు మెరుగైన అనుభవాన్నిస్తున్న రైల్వేలు**

భారతీయ రైల్వేల్లో ఆర్థిక సుస్థిరతను బలోపేతం చేయడంలో ముఖ్యమైన వనరుగా ఛార్జీయేతర ఆదాయం (ఎన్ఎఫ్ఆర్) ఆవిర్భవించింది. ఇది నేరుగా ప్రయాణికులకు లబ్ధి చేకూరుస్తోంది. స్టేషన్ పునరాభివృద్ధి, ప్రకటనలు, రైల్వే ఆస్తుల వాణిజ్య వినియోగం, తదితర వినూత్న కార్యక్రమాల ద్వారా ఆదాయాన్ని సమకూర్చుకుంటోంది. ఈ ఎన్ఎఫ్ఆర్.. ప్రయాణికుల నుంచి వసూలు చేసే టిక్కెట్ ధరలు, సరకు రవాణా ఆదాయంపై అతిగా ఆధారపడటాన్ని తగ్గిస్తుంది. ఈ అదనపు ఆదాయం వల్ల ఆధునిక మౌలిక వసతుల్లో పునఃపెట్టుబడులు పెట్టడానికి, స్టేషన్లలో వసతులను ఉన్నతీకరించడానికి, పారిశుద్ధ్యాన్ని పెంపొందించడానికి, డిజిటల్ సేవలను మెరుగుపరచడానికి, మెరుగైన రైళ్లను, భద్రతా వ్యవస్థలను ప్రవేశపెట్టడానికి వీలు కలుగుతుంది. ఇది అంతిమంగా మరింత సౌకర్యవంతమైన, అనుకూలమైన, విశ్వసనీయమైన ప్రయాణ అనుభవాన్ని ప్రయాణికులకు అందిస్తుంది.

ఆర్థిక సంవత్సరం 2021-22లో రూ. 290 కోట్ల నుంచి ఆర్థిక సంవత్సరం 2025-26 నాటికి సుమారుగా రూ. 777.76 కోట్ల వరకు నిలకడగా ఎన్ఎఫ్ఆర్ ఆదాయం పెరిగింది. గడచిన అయిదేళ్లలో ఈ వృద్ధి 168 శాతంగా నమోదయింది. ఆర్థిక సంవత్సరం 2025-26లో ఎన్ఎఫ్ఆర్ అంచనా లక్ష్యం రూ. 720.85 కోట్లు. ఈ లక్ష్యాన్ని అధిగమించి ఇప్పటి వరకు రూ. 777.76 కోట్ల ఆదాయం సమకూరింది. అంటే 107.9 శాతంగా ఈ వృద్ధి నమోదయింది. ఆర్థిక సంవత్సరం 2024-25లో ఎన్ఎఫ్ఆర్ ఆదాయం రూ. 686.86 కోట్లుగా ఉంది. భారతీయ రైల్వేల ఆర్థిక స్థితిని బలోపేతం చేయడంలో వ్యూహాత్మక ఆదాయ మార్గాలకు పెరుగుతున్న ప్రాధాన్యాన్ని ఈ ధోరణి స్పష్టం చేస్తోంది.

ఎన్ఎఫ్ఆర్‌ను పెంపొందించేందుకు సంస్థల యాజమాన్యంలోని సింగిల్ బ్రాండ్ ప్రీమియం అవుట్‌లెట్లను ఏర్పాటు చేయడానికి వీలుగా కాంట్రాక్టులను ఇచ్చేందుకు జోనల్ రైల్వేలకు మార్గదర్శకాలు జారీ అయ్యాయి. ఈ విధానం పరిధిలో ప్రయాణికులకు మెరుగైన ప్రయాణ వసతులను కొన్ని వినూత్న బ్రాండెడ్ అవుట్‌లెట్లను రైల్వేలు ప్రారంభించాయి. ఇతర బ్రాండ్లకు చెందిన స్టోర్లు సైతం త్వరలోనే ప్రారంభం కానున్నాయి. భారతీయ రైల్వేల్లో ఎన్ఎఫ్ఆర్ ద్వారా 22 ప్రీమియం బ్రాండ్లకు అవుట్‌లెట్లను కేటాయించారు.

ప్రయాణికుల ఆరోగ్యాన్ని, సంక్షేమాన్ని పెంపొందించడంలో భాగంగా.. రైల్వేస్టేషన్లలో 50 ప్రధానమంత్రి భారతీయ జన ఔషధీ కేంద్రాలు (పీఎంబీజేకే)ను ఏర్పాటు చేయడానికి భారతీయ రైల్వే ఒక విధానాన్ని రూపొందించి అమలు చేసింది. భారత ఔషధాలు, వైద్య పరికరాల బ్యూరో నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ స్టాళ్లను నిర్వహిస్తారు. 2024 మార్చి 12న ప్రధానమంత్రి 50 పీఎంబీజేకేలను ప్రారంభించారు. ఈ కార్యక్రమం సాధించిన విజయం ఆధారంగా.. ఈ సంక్షేమ పథకాన్ని మరింత విస్తృతంగా అమలు చేసేలా భారతీయ రైల్వేల్లో అదనంగా 100 పీఎంబీజేకేలను ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ అదనపు 100 పీఎంబీజేకేల్లో 18 స్టోర్లను 2024 నవంబర్ 13న ప్రధానమంత్రి ప్రారంభించారు. ఇప్పటి వరకు భారతీయ రైల్వేల్లో 150 పీఎంబీజేకేలకు గాను 120 పీఎంబీజేకేలను ప్రారంభించారు. భారతీయ రైల్వేల్లో ప్రధానమంత్రి భారతీయ జనఔషధీ కేంద్ర (పీఎంబీజేకే) అవుట్‌లెట్లను మరింత విస్తరించే బాధ్యతను జోనల్ రైల్వేల్లో జనరల్ మేనేజర్లకు అప్పగించారు. తద్వారా పీఎంబీజేకేను విస్తృతంగా అమలు చేయడంతో పాటు.. ప్రయాణికులకు ప్రయోజనం కలిగిస్తూనే మరింత ఆదాయాన్ని ఆర్జించవచ్చు.

వినూత్నమైన ఆలోచనలు, వాటిని సమర్థంగా అమలు చేయడం ద్వారా మెరుగైన ప్రయాణ అనుభవాన్ని మెరుగుపరచడానికి, ఛార్జీయేతర ఆదాయం (ఎన్ఎఫ్ఆర్)ను పెంపొందించడానికి రైల్వేలు నిరంతరం ప్రయత్నాలు చేస్తున్నాయి.

చేపట్టిన కొన్ని ముఖ్యమైన కార్యక్రమాలు: బహుళ అంతస్తుల కార్ పార్కింగ్, వైద్య సేవల కేంద్రం, నర్సింగ్ ప్యాడ్లు, వ్యాగన్లను శుభ్రం చేసే కాంట్రాక్టు, చెల్లింపుల సేవగా ఈ-వీల్ చెయిర్ సౌకర్యం, హెల్త్ కియోస్క్, గేమింగ్ జోన్, ప్లాస్టిక్ బాటిల్ క్రషింగ్ యంత్రం, ఫ్లాట్ఫాం బ్రాండింగ్, ప్రయాణికులు, ప్రజల సౌకర్యార్థం ఖాళీ స్థలాన్ని ఉపయోగించుకోవడం మొదలైనవి.

ప్రీమియం కోవర్కింగ్ స్పేస్/ డిజిటల్ లాంజ్ పేరుతో వినూత్న విధానాన్ని పశ్చిమ రైల్వే రూపొందించింది. ఇది ప్రయాణికులకు హైస్పీడు వైఫై, వర్క్ స్టేషన్లు, ఛార్జింగ్ పాయింట్లు, కాన్ఫరెన్స్ సౌకర్యాలు, సౌకర్యవంతమైన సీట్లను అందిస్తుంది. దీనిలో ప్రింటింగ్, స్కానింగ్, శీతలపానీయాలు అందుబాటులో ఉంటాయి. అలాగే గంటల వారీగా వర్క్ స్పేస్‌ను వినియోగించుకోవడం, కాంబో ప్యాకేజీలు కూడా అందుబాటులో ఉంటాయి. రైల్వే స్టేషన్లలో ఎదురుచూసే సమయాన్ని ఆధునికంగా, సౌకర్యవంతంగా, ఉత్పాదకంగా మార్చే దిశగా వేసిన ముందడుగును ఈ కార్యక్రమం సూచిస్తుంది. రైల్వేల్లో ఇలాంటి మంచి ఆలోచనలను అమలు చేసేందుకు అవసరమైన మార్గదర్శకాలను జోనల్ రైల్వేలకు జారీ చేశారు. పైన పేర్కొన్నవన్నీ భారతీయ రైల్వేల్లో ఛార్జీయేతర ఆదాయ వనరులను పెంపొందిస్తాయి. అదే సమయంలో ప్రయాణికులకు మెరుగైన, సౌకర్యవంతమైన ప్రయాణ అనుభవాన్నిస్తాయి.

# పెద్దపల్లి జిల్లాలో దారుణం.. మూడేళ్ల చిన్నారిని పీక్కుతిన్న కుక్కలు

కరీంనగర్, ఏప్రిల్ 20: పెద్దపల్లి జిల్లాలో దారుణం జరిగింది. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లిలో మూడేళ్ల చిన్నారిని కుక్కలు పీక్కుతిన్నాయి.

వివరాల్లోకి వెళ్తే.. ఒడిశాకు చెందిన ఓ కుటుంబం బతుకుదెరువు కోసం కాట్నపల్లి గ్రామానికి వచ్చి ఇక్కడి ఇటుక బట్టీల్లో పనిచేస్తున్నది. ఆ కుటుంబానికి చెందిన చిన్నారి దివ్య బెహ్రా (3) సోమవారం సాయంత్రం ఇంటి ముందు ఆడుకుంటుండగా వీధి కుక్కలు దాడికి దిగాయి. చిన్నారిని నోట కరుచుకుని పొలాల్లోకి లాక్కెళ్లాయి. అక్కడ చిన్నారిని పీక్కుతిన్నాయి. దీంతో చిన్నారి మరణించింది. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది.


# పాల్వంచలో ఘనంగా పోషణ్ పక్వాడ కార్యక్రమాలు

ఖమ్మం, ఏప్రిల్ 20: పాల్వంచ పట్టణంలోని టీచర్స్ కాలనీ, గట్టాయిగూడెం, ఒడ్డుగూడెం, సబ్‌స్టేషన్ ఏరియా, మార్కెట్ ఏరియా పరిసర ప్రాంతాల అంగన్‌వాడీ కేంద్రాలను సమన్వయం చేస్తూ 38వ డివిజన్‌లో పోషణ్ పక్వాడా కార్యక్రమాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలకు శ్రీమంతం కార్యక్రమం, చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 38వ డివిజన్ బీఆర్ఎస్ కార్పొరేటర్ బత్తుల మధుచంద్, 36వ డివిజన్ కార్పొరేటర్ పైడిపల్లి జయలక్ష్మి, 45వ డివిజన్ కార్పొరేటర్ దంతెబోయిన నరేష్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కార్పొరేటర్లు మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యం కోసం పౌష్టికాహారం చాలా ముఖ్యమని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే పరిశుభ్రత, సమతుల్య ఆహారం, తల్లి?శిశు సంరక్షణపై అవగాహన పెంపొందించాల్సిన అవసరాన్ని వివరించారు. ఈ కార్యక్రమాల ద్వారా స్థానిక ప్రజల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందించడమే లక్ష్యమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నంద్రు దీపా తెలిపారు. ఈ కార్యక్రమంలో వెంగళరావు కాలనీ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నంద్రు దీపా, అంగన్‌వాడీ టీచర్లు పెరుమాళ్లపల్లి సౌభాగ్యం, జిల్లేపల్లి సుగుణవాణి, ఎన్నబోయిన ప్రమీల, ఎస్కే.మౌలాలి, గడ్డం గీత, నందిగామ నాగులు, బండి కళావతి, పాల్గొన్నారు.

# గొప్ప సంఘ సంస్కర్త బసవేశ్వరుడు

## – మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్



వికారాబాద్ , ఏప్రిల్ 20: కుల, లింగ, వర్ణ అసమానతలకు వ్యతిరేకంగా, సమానత్వ సమాజ స్థాపన కోసం బోధనలు చేసి, సామాజిక జాగృతిని ప్రేరేపించిన వ ు ్ ా నీ య ్ ు ు డ ్ ు బసవేశ్వరుడనివికారాబాద్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు.

బసవేశ్వర మహారాజ్ జయంతి సందర్భంగా వికారాబాద్ పట్టణంలోని ఎంఆర్‌పీ చౌరస్తా వద్ద బసవేశ్వరుని విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బసవేశ్వరుని బోధనల నుంచి స్ఫూర్తి పొంది సర్వసమాన సమాజ స్థాపనకు అందరం పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ , బీఆర్ఎస్ పార్టీ మండలాల నాయకులు పాల్గొన్నారు.

# 'మిషన్ భగీరథ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి'

**-పెంచిన వేతనాలు జనవరి నుండి అమలు చేయాలి**

**- సిఐటియు నల్లగొండ జిల్లా ఉపాధ్యక్షుడు దండెపల్లి సత్తయ్యతెలంగాణ సమాచారం**

నల్గొండ, ఏప్రిల్ 20: మిషన్ భగీరథ కాంట్రాక్ట్ కార్మికులకు రావాల్సిన పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సిఐటియు నల్లగొండ జిల్లా ఉపాధ్యక్షుడు దండెంపల్లి సత్తయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నల్లగొండ పట్టణంలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో తెలంగాణ మిషన్ భగీరథ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నల్లగొండ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన సత్తయ్య మాటాడుతూ.. మిషన్ భగీరథ పథకం ద్వారా నల్లగొండ జిల్లాలో 690 గ్రామాలకు మంచినీరు అందిస్తున్న కార్మికులకు అతి తక్కువ రూ.10 వేల నుండి రూ.12 వేలు మాత్రమే వేతనాలు ఇస్తున్నారని, అవి కూడా నెల నెలా ఇవ్వకుండా ఆరు నెలలకు ఒకసారి ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కావునా ప్రతి నెల 5వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

జిల్లా అధికారి సమక్షంలో కాంట్రాక్టులతో జరిగిన ఒప్పందం ప్రకారం పెంచిన వేతనాలను జనవరి నుండి అమలు చేస్తూ పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికుల ఉద్యోగ భద్రత కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ప్రకటించిన ఆ కార్పొరేషన్‌లో మిషన్ భగీరథ కాంట్రాక్ట్ కార్మికులను కూడా చేర్చి వారి జీవితాల్లో వెలుగులు నింపాలని విజ్ఞప్తి చేశారు. ప్రపంచ కార్మిక దినోత్సవం మే 1న మిషన్ భగీరథ వాటర్ ప్లాంట్ల దగ్గర సిఐటియు జెండాలు ఎగురవేసి కార్మిక వర్గ ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. తెలంగాణ మిషన్ భగీరథ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు జంజరాల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి కుడ్డల సైదులు ఉపాధ్యక్షుడు నేలపట్ల అశోక్, కోశాధికారి ఉయ్యాల మురళి, శంకర్, ఆంజనేయులు, వరవేష్, కృష్ణ, సైదులు పాల్గొన్నారు.

# కోడలి ఆత్మహత్యకు కారణమైన మామ అరెస్టు




నల్గొండ, ఏప్రిల్ 20: కోడలి ఆత్మహత్యకు కారణమైన మామను పోలీసులు అరెస్ట్ చేశారు. కేసు వివరాలను సోమవారం సీఐ రాఘవరావు వెల్లడించారు. నాంపల్లి మండలం మహ్మదాపురం గ్రామానికి చెందిన ఐశ్వర్య (20)కు ఐదు నెలల క్రితం పానగల్లుకు చెందిన శివశంకర్‌తో వివాహం జరిగింది. భర్త ఇంట్లో లేని సమయంలో మామ వర్రే లింగయ్య తరచూ వేధింపులకు పాల్పడినట్లుగా ఆరోపణలు. ప్రతి చిన్న విషయానికి తప్పుపట్టడం, అవమానించడం, మానసికంగా హింసించడం చేసినట్లు కుటుంబ సభ్యుల ఫిర్యాదులో తెలిపారు.

"నువ్వు చస్తే నా కొడుకుకు ఇంకా మంచి భార్య వస్తుంది'' అంటూ తీవ్రంగా మామ లింగయ్య కొడలిని వేధింపులకు గురి చేసేవాడు. ఈ వేధింపులు తట్టుకోలేక ఐశ్వర్య ఈ నెల 18న ఉదయం పానగల్లు ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి చింతల వెంకటయ్య ఫిర్యాదుతో నల్లగొండ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయింది. ఎస్ఐ సైదులు ఆధర్యంలో దర్యాప్తు చేపట్టి వర్రే లింగయ్య (45)ను ఈరోజు ఉదయం అతడి నివాసంలో అరెస్టు చేశారు. సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరు పరిచేందుకు రిమాండ్‌కు తరలింపు.

# అంగన్‌వాడీ కేంద్రాల్లో సేవలు పారదర్శకంగా ఉండాలి : ఎమ్మెల్యే కూనంనేని

ఖమ్మం, ఏప్రిల్ 20: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆన్‌లైన్ ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని లక్ష్మీదేవిపల్లి మార్కెట్ యార్డులో పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆయన అంగన్‌వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్లను పంపిణీ చేశారు. ప్రతి అంగన్‌వాడీ టీచర్ ఆయా కేంద్రాల్లో సేవలను కచ్చితంగా ఆన్‌లైన్ చేసి పై అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆహారం, తల్లులకు రేషన్ సరుకులు సక్రమంగా ఇచ్చేందుకే ఈ ఆన్‌లైన్ ప్రక్రియను ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. కొన్ని యాప్‌లు అమల్లోకి తీసుకురావడం వల్ల ప్రభుత్వమే టీచర్లకు స్మార్ట్ ఫోన్లు ఇవ్వటం జరిగిందని ప్రతి ఏరియాలో నెట్ సౌకర్యం ఉన్నందున ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఎలాంటి సమస్యలు వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని, సమస్యలకు పరిష్కారం చేస్తానన్నారు. మారుమూల గ్రామాల్లో ఇంకా అంగన్‌వాడీ కేంద్రాలు స్థల సమస్య వల్ల కొలిక్కి రాలేదని వాటిని కూడా త్వరగా పరిష్కారం చేసి అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సిడిపిఓ లను ఆదేశించారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవిపల్లి సెక్టార్ కొత్తగూడెం ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ కొత్తగూడెం సిడిపివో, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# శిల్పా కాలనీలో భారీ చోరీ

## ఇంట్లో పెళ్లి సందడి మొదలవ్వాల్సిన ఈ సమయంలో

అమరావతి, ఏప్రిల్ 20: వేసవి కాలం అంటే ఒకవైపు మండుటెండలు, మరోవైపు తరచూ కరెంటు కోతలు? ఈ రెండింటి మధ్య ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, ఇదే సమయంలో దొంగలు తమ దుష్ట చూపులను ఇళ్లపై సారిస్తున్నారు. ముఖ్యంగా పెళ్లిళ్లు ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుంటూ చోరీలకు పాల్పడుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎమ్మిగనూరు పట్టణంలోని శిల్పా కాలనీలో చోటుచేసుకున్న భారీ చోరీ సోమవారం స్థానికంగా కలకలం రేపింది.

శిల్పా కాలనీలో నివాసం ఉంటున్న శంకర్ రెడ్డి కుటుంబంలో ఆనందోత్సాహాల మధ్య పెళ్లి వేడుకలకు ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. ఆయన కుమార్తె వివాహం మే 7, 8 తేదీల్లో జరగాల్సి ఉండటంతో, పెళ్లికి కావాల్సిన బంగారు ఆభరణాలు, నగదు, ఇతర సామగ్రిని ముందుగానే సిద్ధం చేసుకున్నారు. ఇంట్లో పెళ్లి సందడి మొదలవ్వాల్సిన ఈ సమయంలో, కుటుంబ సభ్యులు బంధువులకు శుభలేఖలు పంచేందుకు ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లారు.

అయితే ఇదే సమయాన్ని గమనించిన గుర్తు తెలియని దుండగులు, ఇంటి పరిస్థితిని ముందుగానే గమనించి ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఖరీదైన ప్రాంతంలో ఉన్న ఈ ఇల్లు ఖాళీగా ఉందని గుర్తించిన వారు, ఇంటి తాళాలు పగులగొట్టి లోపలికి చొరబడ్డారు. గదులను జల్లెడ పట్టిన దుండగులు, ప్రత్యేకంగా పెళ్లి కోసం భద్రపరిచిన బంగారు ఆభరణాలను లక్ష్యంగా చేసుకున్నారు.

ఈ చోరీలో సుమారు రూ.30 లక్షలు విలువ చేసే 21 తులాల బంగారు ఆభరణాలు, అదనంగా రూ.15 వేల నగదు అపహరణ చేయబడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పెళ్లి కోసం ఎంతో ఆశగా, శ్రద్ధగా సిద్ధం చేసిన ఆభరణాలు క్షణాల్లో మాయమవ్వడంతో కుటుంబ సభ్యులు షాక్కు గురయ్యారు.

తరువాత ఇంటికి చేరుకున్న కుటుంబ సభ్యులు ఇంటి తలుపులు పగులగొట్టబడిన స్థితిని గమనించి ఒక్కసారిగాగ్రాభ్రాంతికి గురయ్యారు. లోపలికి వెళ్లి చూసేసరికి అల్మారాలు తెరిచి ఉండటం, వస్తువులు చెల్లాచెదురుగా పడివుండటం చూసి వారు కన్నీరుమున్నీరయ్యారు. పెళ్లి ఆనందం ఒక్కసారిగా విషాదంగా మారింది.

ఈ ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, పట్టణ సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీమ్‌ను పిలిపించి, ఇంట్లోని వేలిముద్రలు సేకరించారు. దొంగలు ఎలాంటి మార్గం ద్వారా లోపలికి వచ్చారు, ఎంతసేపు ఉన్నారు, ఎవరైనా ముందుగా గమనించారా అనే కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

స్థానిక సీసీటీవీ కెమెరాల ఫుటేజీని కూడా పరిశీలిస్తూ, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై పోలీసులు దృష్టి సారించారు. ఈ చోరీ ముందస్తు ప్లాన్‌తో జరిగిందా? లేక ఆకస్మికంగా జరిగినదా? అనే అంశాలపై కూడా విచారణ కొనసాగుతోంది.

పెళ్లి జరగాల్సిన ఇంట్లోనే ఇలాంటి భారీ చోరీ జరగడం స్థానికులను కలవరపెడుతోంది. ఒకవైపు భద్రతా లోపాలపై ప్రశ్నలు తలెత్తుతుండగా, మరోవైపు పెళ్లి ఇంట్లో విషాదం నెలకొనడం అందరినీ కలచివేస్తోంది.

పెళ్లి సందడితో కళకళలాడాల్సిన ఆ ఇల్లు, ఇప్పుడు కన్నీటి కళ్లతో నిండిపోవడం బాధాకరం. పోలీసులు నిందితులను త్వరగా పట్టుకుని, అపహరించిన సొత్తును రికవరీ చేస్తారా అన్నది ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

# ఇంట్లో ప్రియుడితో సోదరి.. ఆమెను కొట్టి చంపిన సోదరులు

లక్నో, ఏప్రిల్ 20: ఒక వ్యక్తి రాత్రి వేళ తన ఇంటికి చేరుకున్నాడు. ఇంట్లో ప్రియుడితో కలిసి సోదరి ఉండటాన్ని అతడు చూశాడు. మరో ఇద్దరు సోదరులను రప్పించాడు. ఆ ముగ్గురూ కలిసి సోదరిని కొట్టి చంపారు. ఆమె ప్రియుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఉత్తరప్రదేశ్‌లోని మహారాజ్‌గంజ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఏప్రిల్ 16న రాత్రివేళ 19 ఏళ్ల యువతి సోదరుడు ఇంటికి చేరుకున్నాడు. ప్రియుడైన రవి కుమార్ గుప్తాతో కలిసి సోదరి ఉండటాన్ని అతడు చూశాడు. వారిద్దరిని గదిలో బంధించాడు. మిగతా ఇద్దరు సోదరులను కూడా ఇంటికి రప్పించాడు.

కాగా, ముగ్గురు సోదరులు కలిసి తమ సోదరి, ఆమె ప్రియుడ్ని ఐరన్ రాడ్లతో కొట్టారు. దెబ్బలు తాళలేక ఆ యువతి అక్కడికక్కడే మరణించింది. గాయపడిన ప్రియుడు రవి అక్కడి నుంచి తప్పించుకుని పారిపోయాడు. అయితే అతడి ఇంటికి చేరుకుని తిరిగి కొట్టారు.

# జూలూరుపాడు ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎంపీడీఓ

ఖమ్మం, ఏప్రిల్ 20: జూలూరుపాడు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సోమవారం ఎంపీడీఓ తాళ్లూరి రవి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన వసతి గృహంలోని ప్రతి విభాగాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ముందుగా వంట గదిని సందర్శించిన ఎంపీడీఓ విద్యార్థులకు వడ్డిస్తున్న భోజన నాణ్యతను తనిఖీ చేశారు. నిల్వ ఉన్న నిత్యావసర సరుకులు, వంట సామగ్రిని పరిశీలించి పురుగులు పట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అనంతరం వసతి గృహంలోని టాయిలెట్స్, స్నానపు గదులను సందర్శించి, పరిశుభ్రతపై అసహనం వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్య దృష్ట్యా నిత్యం బ్లీచింగ్ చల్లాలని, పారిశుధ్య నిర్వహణలో ఎట్టి పరిస్థితుల్లోనూ అలసత్వం వహించకూడదని ఆదేశించారు.

వసతి గృహానికి సంబంధించిన అటెండెన్స్ రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్ వంటి రికార్డులను ఆయన నిశితంగా పరిశీలించారు. విద్యార్థుల హాజరుకు అనుగుణంగానే మెనూ అమలు కావాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వసతి గృహ సంక్షేమ అధికారికి పలు కీలక సూచనలు చేస్తూ.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యార్థులకు అందాల్సిన అన్ని సదుపాయాలు సక్రమంగా అందేలా చూడాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ?విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా నాణ్యమైన విద్యతో పాటు, పౌష్టికాహారాన్ని అందించడమే లక్ష్యంగా పనిచేయాలని ఆయన పేర్కొన్నారు.

# రాష్ట్రపతిని కలిసిన భారతీయ రైల్వే ప్రొబేషనరీ అధికారులు, కేంద్ర ఇంజనీరింగ్ సర్వీస్ కు చెందిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20:భారత రైల్వే ప్రొబేషనరీ అధికారులు (2022, 2023 బ్యాచ్) కేంద్ర ఇంజనీరింగ్ సర్వీస్ (రోడ్లు)కు చెందిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు (2021 నుంచి 2024 బ్యాచ్ వరకు) ఏప్రిల్ 20న రాష్ట్రపతి భవన్‌లో భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్మును మర్యాదపూర్వకంగా కలిశారు.

అధికారులను ఉద్దేశించి రాష్ట్రపతి మాట్లాడుతూ.. భారత్ అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న కీలక తరుణంలో యువ అధికారులు ప్రజా సేవలో చేరారని అన్నారు. వికసిత్ భారత్ నిర్మాణమే సమష్టి లక్ష్యంగా భారత్ ముందుకు సాగుతోందని ఆమె అన్నారు. భారతీయ రైల్వే, సెంట్రల్ ఇంజనీరింగ్ సర్వీస్ అధికారులుగా.. వీరు చేపట్టే బాధ్యతలు లక్షలాది మంది ప్రజల జీవితాలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతాయని తెలిపారు. అధికారులు తీసుకునే నిర్ణయాలు, చర్యలు పౌరుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని స్పష్టం చేశారు.

ఆధునిక దేశాల నిర్మాణానికి మౌలిక సదుపాయాలే పునాది అని రాష్ట్రపతి తెలిపారు. రైల్వేలు, రహదారులు కేవలం రవాణా వ్యవస్థలు మాత్రమే కావని.. ఆర్థిక విస్తరణకు, సామాజిక సమ్మేళనానికి, జాతీయ సమైక్యతకు సాధనాలుగా పేర్కొన్నారు. ఒక రైలు మారుమూల గ్రామానికి చేరుకున్నా లేదా ఒక రహదారి సుదూర ప్రాంతాన్ని కలిపినా.. అది ఆయా ప్రాంతాల సామాజిక, ఆర్థిక అభివృద్ధికి అపారమైన అవకాశాలను కల్పిస్తుందని అన్నారు.

పటిష్టమైన మౌలిక సదుపాయాలు రవాణా ఖర్చులను తగ్గించి, వాణిజ్యాన్ని ప్రోత్సహిస్తూ, పెట్టుబడులను, ఉత్పాదకతను పెంచుతాయని రాష్ట్రపతి అన్నారు.

ఇది వివిధ ప్రాంతాలను, ప్రజలను దగ్గర చేయడం ద్వారా జాతీయ ఐక్యతను బలపరుస్తుందన్నారు. కేవలం గణాంకాలు మాత్రమే విజయానికి కొలమానం కాదన్న విషయాన్ని అధికారులు గుర్తుంచుకోవాలని సూచించారు. వారు చేసే పని ప్రజల జీవితాలను ఎంతవరకు మెరుగుపరిచిందనేదే అసలైన విజయమని ఆమె స్పష్టం చేశారు.

ప్రజా సేవలు నిజాయితీ, జవాబుదారీతనం, అత్యుత్తమ పనితీరుపై అంకితభావం వంటి విలువలను కాపాడాలని రాష్ట్రపతి అధికారులకు సూచించారు. విధి నిర్వహణలో సవాళ్లు ఎదురైనప్పుడు, కఠినమైన నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చినప్పుడు ఆ విలువలే అధికారులకు మార్గదర్శకంగా ఉండాలని చెప్పారు. ఎప్పుడూ కొత్త విషయాలను తెలుసుకోవాలనే కుతూహలంతో ఉండాలని, నిరంతరం నేర్చుకుంటూ, కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించాలని హితవు పలికారు. వారు తీసుకునే నిర్ణయాలు, పాటించే ప్రమాణాలు, చూపించే అంకితభావం సమాజంపై శాశ్వత ప్రభావాన్ని చూపుతాయని పేర్కొన్నారు. అధికారులు కేవలం కార్యనిర్వాహకులు మాత్రమే కాదని.. అభివృద్ధి కారకులనీ, ప్రజల విశ్వాసానికి సంరక్షకులని ఆమె అన్నారు.

# 'పౌష్టికాహారం తీసుకునేలా ప్రోత్సహించాలి'

## –ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వినోదకుమారి

నల్గొండ, ఏప్రిల్ 20: చిన్నారులు, గర్భిణులు, బాలింతలో రక్తహీనతను తగ్గించేందుకు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకునేలా ప్రోత్సాహించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వినోదకుమారి అన్నారు. సోమవారం నల్లగొండ పట్టణంలోని చైతన్యపురి కాలనీ సెక్టార్ పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని రైతు బజార్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించి, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చాలామంది మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారని దీనివల్ల చిన్నారులు బలహీనంగా అనారోగ్యంతో జన్మించి చనిపోతున్నారని తెలిపారు. దీన్ని పౌష్టికాహారం లోపాన్ని అదిగమించేందుకు గర్భిణులు, బాలింతలు ఏ సమయంలో ఎలాంటి ఆహారం తీసుకోవాలి, ఏ రకమైన




అదిగమిం చేందుకు ప్రభుత్వం పోషణ్ అభియాన్ పేరుతో వెయ్యి రోజుల కార్యక్రమాన్ని తీసుకు వచ్చింద న్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వార బాలింతలు, చిన్నారులు, గర్భిణు లకు పౌష్టికాహారాన్ని అందిస్తు న్నందున సద్వినియోగం చేసుకుని ఆరోగ్యవంతంగా ఉండాలన్నారు. మహిళల్లో రక్తహీనత కారణంగా చిన్నారులు భోజనం తీసుకో వాలనే అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్ర మంలో అంగన్‌వాడీ టీచర్లు పుట్ట సునీత, అమనగంటి సముద్రమ్మ, ఉమామహేశ్వరి, రజియాసు ల్తానా, అనంతలక్ష్మి, ఫర్జానా, స్వప్న, సరిత, అరుణజ్యోతి, షహనాజ్, జరీనా, జంపాల దివ్య, అతిత, రేణుక, అలివేలు, పాల్గొన్నారు.

# బీసీ గురుకులాల్లో జూనియర్ ఇంటర్మీడియట్ అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదల

హైదరాబాద్, ఏప్రిల్ 20: బీసీ గురుకులాల్లో 2026-27 విద్యా సంవత్సరంలో జూనియర్ ఇంటర్మీడియట్ కోర్సులకు దరఖాస్తు చేసుకోవాలని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు తెలిపారు.తెలంగాణ సమాచారం

పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఈనెల 22వ తేది నుంచి ఆన్‌లైన్‌లో https://mjptbcwreis.telangana.gov.in (లేదా),https://mjptbcadmi ssions.org/MJP-Inter చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకోవడానికి వచ్చే నెల 12 వ తేదీ చివరి తేదీ అని ఆయన పేర్కొన్నారు. జూనియర్ ఇంటర్మీడియట్‌లో రెగ్యులర్ 5 గ్రూప్ లు ఎంపీసీ,బైపీసీ ( , ఎంఈసీ ,సీఈసీ , హెచ్ఈసీ లతో పాటు 7 గ్రూప్ ల వృత్తి విద్యా కోర్సులు (ఒకేషనల్ కోర్స్) లకు దరఖాస్తులు చేసుకోవాలనిస సూచించారు.

అగ్రికల్చర్ అండ్ క్రాప్ ప్రొడక్షన్, కంప్యూటర్ గ్రాఫిక్స్ అండ్ యానిమేషన్, ప్రీ స్కూల్ టీచర్ ట్రైనింగ్, కమర్షియల్ గార్మెంట్ టెక్నాలజీ, మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్, మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, ఫిజియోథెరపీ ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. రెగ్యులర్ కోర్సులతో పాటు వృత్తి విద్య కోర్సుల్లో సీట్లు అందుబాటులో ఉన్నాయని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రాష్ట్ర వ్యాప్తంగా 146 కాలేజీలలో బాలురకు 12,640 సీట్లు, 144 కాలేజీ లలో బాలికలకు 12,080 సీట్లు ఉన్నాయని ఆయన తెలిపారు. 10వ తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తామని సెక్రటరీ వెల్లడించారు. బీసీ గురుకులాల్లో 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థినీ, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని, తమ స్కూల్ ప్రిన్సిపాల్‌కు దరఖాస్తు ఇస్తే సరిపోతుందని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 040-23328266 లో సంప్రదించాలని ఆయన సూచించారు.

# నిద్రిస్తున్న వ్యక్తిపై వ్యక్తిపై బ్లేడుతో దాడి చేసిన దుండగుడు

హైదరాబాద్, ఏప్రిల్ 20: నిద్రిస్తున్న వ్యక్తిపై మరో వ్యక్తి బ్లేడుతో దాడికి పాల్పడిన సంఘటన స్థానికంగా కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే..అత్తపూర్ సులేమాన్ నగర్‌లో రెహానా అనే వ్యక్తి నిద్రిస్తుండగా మరో వ్యక్తి బ్లేడుతో దాడికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని హాస్పిటల్‌కు తరలించారు. తనను ఫర్నిచర్ షాపులో పనిలోంచి తొలగించి రెహానాను పెట్టుకోవడంతో దుండగుడు ఆగ్రహంతో దాడికి పాల్పడినట్లు తెసింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని సీసీ ఫుటేజీ ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# మొరాకో కాసాబ్లాంకా నుంచి బయల్దేరిన ఐఎన్ఎస్ సుదర్శిని

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20:భారతీయ నౌకాదళంలోని శిక్షణ నౌక ఐఎన్ఎస్ సుదర్శిని 2026 ఏప్రిల్ 18న మొరాకోలోని కాసాబ్లాంకా సందర్శన పూర్తయింది. లోకయాన్-26 యాత్రలో భాగంగా.. ఇండో-మొరాకో నౌకాదళ భాగస్వామ్యాన్ని బలోపేతం చేసే దిశగా ఈ పర్యటన ఓ ముఖ్యమైన విజయంగా నిలిచింది.

ఈ సందర్భంగా పరస్పర శిక్షణ, నౌకావాణిజ్య సహకారంపై మొరాకో నౌకాదళ అధికారులతో ఐఎన్ఎస్ సుదర్శిని కమాండింగ్ అధికారి చర్చలు జరిపారు. సహృద్భావ సందర్శనలు, స్నేహపూర్వక క్రీడా పోటీల్లో రాయల్ మొరాకన్ నేవల్ స్కూల్ క్యాడెట్లతో భారతీయ నౌకాదళ శిక్షణార్థులు సంభాషించారు. ఇలాంటి చురుకైన శిక్షణ కార్యక్రమాల ద్వారా లోకయాన్ స్ఫూర్తి ప్రతిబింబిస్తుంది. ఐఎన్ఎస్ సుదర్శినిలో ఆతిథ్యమిచ్చిన విందు, రాయల్ మొరాకన్ నౌకాదళం ఏర్పాటు చేసిన విందు వృత్తిపరమైన, సాంస్కృతిక పరమైన సంబంధాలు బలోపేతమయ్యాయి.

ఉమ్మడి నౌకా దళాల ఆసక్తులు, వ్యూహాత్మక సంబంధాల ఆధారంగా రెండు దేశాల మధ్య ఉన్న నౌకా రక్షణ సంబంధాలను ప్రస్తుత పర్యటన బలోపేతం చేస్తుంది. వసుధైక కుటుంబం అనే సందేశాన్ని, సముద్రాల ఆవలి వరకు సద్భావనను ముందుకు తీసుకెళుతూ.. స్పెయిన్లోని పల్మాస్‌కు ఐఎన్ఎస్ సుదర్శిని బయలుదేరింది.

# భారత దేశ ఇంధన భద్రతను బలోపేతం చేయడంలో, పెట్రో రసాయనాల్లో స్వయం సమృద్ధిని విస్తరించడంలో కీలకపాత్ర పోషించనున్న ప్రాజెక్టు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2026 ఏప్రిల్ 21న రాజస్థాన్లో పర్యటిస్తారు. ఆ రోజు ఉదయం 11:30 గంటలకు బలోత్రాలోని పచ్‌పద్రా వద్ద దేశంలోనే మొదటిసారి ఏర్పాటు చేసిన సమీకృత చమురుశుద్ధి, పెట్రో రసాయన కర్మాగార సముదాయాన్ని జాతికి అంకితం చేస్తారు. అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగిస్తారు.

భారత దేశ ఇంధన భద్రత, పెట్రోరసాయనాల రంగంలో సాధించిన విజయాన్ని ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు సూచిస్తుంది. హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్), రాజస్థాన్ ప్రభుత్వం సంయుక్తంగా దీనిని అభివృద్ధి చేశాయి. ఏడాదికి 9 మిలియన్ల మెట్రిక్ టన్నుల (ఎంఎంటీపీఏ) సామర్థ్యం ఉన్న ఈ చమురు శుద్ధి, పెట్రో రసాయనాల సముదాయాన్ని రూ.79,450 కోట్లకు పైగా పెట్టుబడితో నిర్మించారు.

అత్యాధునిక సౌకర్యాలతో నిర్మించిన ఈ సముదాయం 2.4 ఎంఎంటీపీఏల సామర్థ్యంతో చమురు శుద్ధిని, పెట్రో రసాయనాల ఉత్పత్తిని ఏకీకృతం చేస్తుంది. సామర్థ్యం, సుస్థిరతలో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఈ చమురు శుద్ధి కర్మాగారం 17.0 అధిక నెల్సన్ కాంప్లెక్సిటీ ఇండెక్సును కలిగి ఉంది. 26 శాతం కంటే ఎక్కువ పెట్రో రసాయనాలను ఉత్పత్తి చేస్తుంది.

దేశ ఇంధన భద్రతను బలోపేతం చేయడంలో, పెట్రో రసాయనాల్లో స్వయం సమృద్ధిని విస్తరించడంలో ఈ ప్రాజెక్టు కీలకపాత్ర పోషిస్తుందని అంచనా వేస్తున్నారు. అలాగే, ఈ ప్రాంతంలో పెట్రో రసాయన, ప్లాస్టిక్ పార్కు అభివృద్ధికి అవసరమైన ప్రధాన పరిశ్రమగా పనిచేయడంతో పాటు అనుబంధ పరిశ్రమలను, అనుబంధ రంగాలను ప్రోత్సహిస్తుంది. అదనంగా, గణనీయ స్థాయిలో ఉద్యోగావకాశాలను కల్పించి.. ఈ ప్రాంత సామాజిక, ఆర్థికాభివృద్ధికి ఈ చమురుశుద్ధి కర్మాగారం సహకారం అందిస్తుంది.

# శాసనసభల సాధారణ ఎన్నికలు, ఉప ఎన్నికలు - 2026 డ్రై-డే అమలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20: అస్సాం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల శాసనసభలకు సాధారణ ఎన్నికలు, ఆరు రాష్ట్రాల్లో ఉప ఎన్నికల నిర్వహణకు భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) 2026 మార్చి 15న షెడ్యూల్ ప్రకటించింది.

తమిళనాడు, పశ్చిమ బెంగాల్ (మొదటి దశ) ఎన్నికలు 2026 ఏప్రిల్ 23 (గురువారం)న జరుగుతాయి. పశ్చిమ బెంగాల్ (రెండో దశ) ఎన్నికలు 2026 ఏప్రిల్ 29 (బుధవారం)న జరుగుతాయి. ఎన్నికలు జరిగిన అన్ని రాష్ట్రాలూ, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓట్ల లెక్కింపు 2026 మే 4 (సోమవారం)న జరుగుతుంది.

ప్రజా ప్రాతినిధ్య చట్టం - 1951లోని 135సీ సెక్షన్ ప్రకారం ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో పోలింగ్ ముగిసే వరకు 48 గంటల పాటు మద్యం అమ్మకాలపై నిషేధం ఉంటుంది. పోలింగ్ జరిగే ప్రాంతాల్లోని హోటల్, భోజన శాలలు, మద్యం అమ్మే దుకాణాలు, మరే ఇతర ప్రభుత్వ, ప్రైవేటు ప్రదేశాల్లో అయినా.. మద్యం, పులియబెట్టిన లేదా మత్తు కలిగించే లిక్కర్ లేదా ఎలాంటి ఇతర మత్తు పదార్థాల అమ్మకాలు లేదా పంపిణీ చేయకూడదు.

పైన పేర్కొన్న చట్టం ప్రకారం.. శాసనసభ ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో వర్తించే నిబంధలనకు అనుగుణంగా పోలింగ్ పూర్తయ్యే వరకు 48 గంటల పాటు డ్రై డేగా ప్రకటించాలి. ఒకవేళ ఏదైనా రీ-పోల్ చేయాల్సి వస్తే, ఆ తేదీకి కూడా ఇది వర్తిస్తుంది.

ఓట్ల లెక్కింపు జరిగే రోజైన 2026 మే 4 (సోమవారం)న కూడా ఆయా రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల్లో వర్తించే నిబంధనల ప్రకారం డ్రై డేగా ప్రకటించాలని కమిషన్ ఆదేశించింది.

మద్యం దుకాణాలు, రెస్టారెంట్లు, క్లబ్బులతో సహా మద్యం అమ్మే లేదా అందించే ఏ ఇతర సంస్థలైనా పైన పేర్కొన్న తేదీల్లో మద్యాన్ని ఎవరికైనా అమ్మడానికి లేదా అందించడానికి అనుమతి లేదు. నాన్-ప్రొప్రయిటరీ క్లబ్బులు, స్టార్ హోటళ్లు, రెస్టారెంట్లు, మద్యం నిల్వ చేయుడానికి, సరఫరాలకు వివిధ విభాగాల పరిధిలో లైసెన్సులు కలిగి ఉన్న హోటళ్లకు ఈ రోజుల్లో అమ్మకాలు సాగించడానికి అనుమతి లేదు. పైన పేర్కొన్న కాల వ్యవధిలో వ్యక్తులు మద్యం నిల్వ చేసుకోవడాన్ని అరికట్టాలి. లైసెన్సు లేని ప్రదేశాల్లో మద్యం నిల్వ చేయడంపై నియంత్రణలను పటిష్టంగా అమలు చేయాలి.

# నగరంలో జంట హత్యల కలకలం

హైదరాబాద్, ఏప్రిల్ 20:నగరంలోని పాతబస్తీ మీర్ చౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో జంట హత్యలు కలకం సృష్టిస్తున్నాయి. నూరుఖాన్ బజార్ లో అదిల్ ఖాన్ అనే వ్యక్తి అతని సోదరుడు అఖ్వీల్ ఖాన్ ,అజ్మీరి బేగం అనే ఇద్దరిని ఇంట్లో దారుణంగా హత్య చేసి పరారయ్యాడు

విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్లూస్ టీం తో ఆధారాలు సేకరిస్తూ, కేసు నమోదు చేసి హత్యకు గల కారణాలు పై ఆరా తీస్తున్నారు.

మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు.

# అంగన్‌వాడీ కేంద్రాల్లో సేవలు పారదర్శకంగా ఉండాలి : ఎమ్మెల్యే కూనంనేని

ఖమ్మం, ఏప్రిల్ 20: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆన్‌లైన్ ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని లక్ష్మీదేవిపల్లి మార్కెట్ యార్డులో పోషణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆయన అంగన్‌వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్లను పంపిణీ చేశారు. ప్రతి అంగన్‌వాడీ టీచర్ ఆయా కేంద్రాల్లో సేవలను కచ్చితంగా ఆన్‌లైన్ చేసి పై అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆహారం, తల్లులకు రేషన్ సరుకులు సక్రమంగా ఇచ్చేందుకే ఈ ఆన్‌లైన్ ప్రక్రియను ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. కొన్ని యాప్‌లు అమల్లోకి తీసుకురావడం వల్ల ప్రభుత్వమే టీచర్లకు స్మార్ట్ ఫోన్లు ఇవ్వటం జరిగిందని ప్రతి ఏరియాలో నెట్ సౌకర్యం ఉన్నందున ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.

ఎలాంటి సమస్యలు వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని, సమస్యలకు పరిష్కారం చేస్తానన్నారు. మారుమూల గ్రామాల్లో ఇంకా అంగన్‌వాడీ కేంద్రాలు స్థల సమస్య వల్ల కొలిక్కి రాలేదని వాటిని కూడా త్వరగా పరిష్కారం చేసి అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సిడిపిఓ లను ఆదేశించారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవిపల్లి సెక్టార్ కొత్తగూడెం ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ కొత్తగూడెం సిడిపివో, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# ఫీజు చెల్లింపు గడువు పొడిగింపు

నల్గొండ, ఏప్రిల్ 20: తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విద్యా మండలి నిర్వహించే పాలీసెట్ 2026 ప్రవేశ పరీక్షకు సంబంధించిన ఫీజు చెల్లింపు గడువును అధికారులు పొడిగించారు. ముందుగా ఏప్రిల్ 20తో ముగియాల్సిన లేట్ ఫీజు లేకుండా ఆన్‌లైన్ దరఖాస్తుల చివరి తేదీని ఏప్రిల్ 22 వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం కొనసాగుతుందని తెలిపారు. పాలీసెట్?2026 పరీక్షను మే 13న నిర్వహించనున్నట్లు మండలి స్పష్టం చేసిందన్నారు.

ఈ నేపథ్యంలో అభ్యర్థులు ఈ పొడిగించిన గడువును వినియోగించుకుని సమయానికి దరఖాస్తులు పూర్తి చేసుకోవాలని కొత్తగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ బండి శ్రీనివాస్ సూచించారు.

# అగ్నిమాపక సిబ్బంది సేవలు అభినందనీయం : ఎమ్మెల్యే పద్మావతి



నల్గొండ, ఏప్రిల్ 20: విపత్తుల సమయంలో అగ్నిమాపక సిబ్బంది చేస్తున్న సేవలు అభినందనీయమని కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి అన్నారు. సోమవారం కోదాడ పట్టణంలోని బాలాజీ నగర్ అగ్నిమాపక కార్యాలయంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న వారోత్స వాలు ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించడంలో అగ్నిమాపక సిబ్బంది సేవలు అభినందనీయమన్నారు. కోదాడ ఫైర్ స్టేషన్‌కు త్వరలోనే సరికొత్త ఫైర్ ఇంజిన్ వాహనాన్ని మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

అలాగే సిబ్బంది, బాలాజీ నగర్ ప్రజల కోసం కార్యాలయ ఆవరణలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, క్విజ్ పోటీలలో విజేతలకు బహుమతులను అందజేశా రు. అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఎర్నేని కుసుమ, వైస్ చైర్మన్ మల్లీశ్వరి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు,జిల్లా ఫైర్ ఆఫీసర్ వై కృష్ణారెడ్డి, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ డాక్టర్ బాబు, స్థానిక కౌన్సిలర్ రామిశెట్టి ఉదయశ్రీ హరిప్రసాద్, చైతన్య నాయక్ మున్సిపల్ కమిషనర్ రమాదేవి సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా వెంపటి ఎంపీపీఎస్ వార్షికోత్సవ వేడుకలు



నల్గొండ, ఏప్రిల్ 20: తుంగతుర్తి మండల పరిధిలోని వెంపటి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, సినిమా పాటలు, జానపద గీతాలు, తెలంగాణ పాటలు, దేశభక్తి గీతాలకు నృత్యాలు చేసి అలరించారు. సోషల్ మీడియా మాయ, చినిగిన దుప్పటివంటి నాటికలను ప్రదర్శించి సమాజానికి ఉపయోగకరమైన సందేశాలతో ఆలోచింప జేశారు. పాఠశాల ఉపాధ్యాయుడు మల్లెపాక రవీందర్ అందెశ్రీ రచించిన "చూడ సక్కాని తల్లి చుక్కల్లో జాబిల్లి" పాటకు చేసిన నృత్యంతో ఆకట్టుకున్నారు. ఈ ప్రదర్శనలో వివిధ కులవృత్తులను ప్రతిబింబిస్తూ విద్యార్థులు పాత్రధారణ చేసి సమానత్వం, సమాజ ఐక్యతను చాటి చెప్పారు.


మరో ఉపాధ్యాయుడు గుండ్ల ఆంజనేయులు ప్రదర్శించిన చదువు గొప్పతనాన్ని తెలియజేసే నృత్యం ప్రేక్షకుల హృదయాలను హత్తుకోవడం జరిగింది. కార్యక్రమం అనంతరం వార్షికోత్సవంలో పాల్గొన్న ప్రతి విద్యార్థికి అతిథుల చేత మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు చిత్తలూరువెంకట్రామనరసమ్మ, గ్రామ సర్పంచ్ తప్పెట్ల ఎల్లయ్య, ఉప సర్పంచ్ దాసరి మంజుల, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కోరుకొప్పుల ఉమారాణి, ఉపాధ్యాయులు మల్లెపాక రవీందర్, గట్టు మాధవి, నిమ్మర బోయిన నవీన, బండారు భవాని,జీడి అనిల్ కుమార్, మిట్టగడుపుల విక్రం, మాలోతు కృష్ణ, గుండ్ల ఆంజనేయులు, రామనబోయిన మౌనిక, అబ్బగాని మంజుల, శీలోజ్ రమాదేవి పాల్గొన్నారు.

# హిమగిరి శిఖరాన హరిహర నివాసం: చార్ ధాం పవిత్ర దర్శనం

భారతీయ ఆధ్యాత్మిక వైభవం, హిమాలయాల అచంచల ప్రశాంతత, మరియు మానవ అంతర్మథనం కలబోసిన అద్భుత ఆధ్యాత్మిక మహాక్రతువు 'చార్ ధాం యాత్ర'. హిందూ ధర్మ శాస్త్రాల ప్రకారం, మానవ జన్మ ధన్యమవ్వాలన్నా, సంసార సాగరంలోని కర్మబంధాల నుండి విముక్తి పొంది మోక్షాన్ని ఆస్వాదించాలన్నా చార్ ధాం దర్శనం అనివార్యమని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని గర్వాల్ హిమాలయ శ్రేణులలో కొలువై ఉన్న యమునోత్రి, గంగోత్రి, కేదార్‌నాథ్, బద్రీనాథ్ అనే నాలుగు పుణ్యక్షేత్రాల సమాహారమే ఈ యాత్ర. ఇది కేవలం భౌగోళిక ప్రయాణం కాదు, భౌతిక ప్రపంచం నుండి ఆధ్యాత్మిక ప్రపంచానికి సాగే ఒక అంతర్ ప్రయాణం. ప్రాచీన కాలం నుండి నేటి ఆధునిక యుగం వరకు ఈ యాత్ర తన ప్రాముఖ్యతను నిలుపుకుంటూ, కోట్లాది మంది భారతీయుల నమ్మకానికి ప్రతీకగా నిలుస్తోంది.

చార్ ధాం యాత్ర ప్రాశస్త్యాన్ని పరిశీలిస్తే, దీని మూలాలు పురాణ కాలంలోనూ మరియు ఎనిమిదవ శతాబ్దానికి చెందిన జగద్గురు ఆది శంకరాచార్యుల కాలంలోనూ కనిపిస్తాయి. హిందూ సంస్కృతిలో 'ధామ్' అనగా దేవుని నివాసం అని అర్థం. భరతఖండం నలుమూలలా శంకరాచార్యులు స్థాపించిన నాలుగు ప్రధాన ధామ్‌లు (పూరీ, ద్వారక, రామేశ్వరం, బద్రీనాథ్) ఉన్నప్పటికీ, ఉత్తరాఖండ్‌లోని ఈ నాలుగు క్షేత్రాలను 'ఛోటా చార్ ధాం'గా వ్యవహరిస్తారు. శతాబ్దాల క్రితం హిమాలయాల్లోని దుర్గమారణ్యాల మధ్య ఉన్న ఈ ఆలయాలను ఆది శంకరాచార్యుడు పునరుద్ధరించి, భారతీయ సనాతన ధర్మాన్ని ఏకం చేసేందుకు వీటిని ప్రధాన ఆధ్యాత్మిక కేంద్రాలుగా తీర్చిదిద్దారు. నాటి నుండి నేటి వరకు, హిమాలయాలలోని ఈ ప్రాంతాలు మునులు, యోగులు మరియు తపస్వులకు నిలయంగా ఉంటూ, సామాన్య భక్తులకు మోక్షద్వారాలుగా భాసిల్లుతున్నాయి.

యాత్ర క్రమానుగత పద్ధతిని గమనిస్తే, ఇది నైరుతి నుండి ఈశాన్యం వైపునకు సాగుతుంది. సంప్రదాయం ప్రకారం యాత్రికులు తొలుత యమునోత్రిని దర్శిస్తారు. ఇది యమునా నదికి జన్మస్థానం. సూర్యపుత్రిక అయిన యమునా దేవికి అంకితం చేయబడిన ఈ ఆలయం సముద్ర మట్టానికి సుమారు 3,293 మీటర్ల ఎత్తులో ఉంటుంది. ఇక్కడ స్నానం చేయడం వల్ల యమపాశం నుండి విముక్తి కలుగుతుందని పురాణాలు చెబుతున్నాయి. అనంతరం భక్తులు గంగోత్రికి చేరుకుంటారు. ఇది భాగీరథి (గంగా) నదికి మూలస్థానమైన గోముఖానికి సమీపంలో ఉంటుంది. భగీరథుని తపస్సుకు మెచ్చి గంగమ్మ ఇక్కడే భూమికి దిగివచ్చిందని ప్రతీతి. గంగానది పవిత్రత భారతీయ జీవనశైలిలో ఎంతటి విశిష్ట స్థానాన్ని కలిగి ఉందో మనందరికీ విదితమే. ఈ రెండు నదీ మూలాలను దర్శించిన తర్వాత భక్తుల ప్రయాణం అత్యంత కఠినమైన, పవిత్రమైన కేదార్‌నాథ్ వైపు సాగుతుంది.



కేదార్‌నాథ్ ధామ్ శివుని పన్నెండు జ్యోతిర్లింగాలలో అత్యంత ఎత్తులో ఉన్న క్షేత్రం. మహాభారత యుద్ధానంతరం పాండవులు తమ పాప పరిహారం కోసం శివుని వెతుక్కుంటూ వచ్చి ఇక్కడ ఆలయాన్ని నిర్మించారని ఐతిహ్యం. మందాకినీ నది ఒడ్డున కొలువై ఉన్న ఈ క్షేత్రం భక్తికి, పట్టుదలకు పరీక్షగా నిలుస్తుంది. చివరగా భక్తులు బద్రీనాథ్‌కు చేరుకుంటారు. విష్ణుమూర్తి బద్రీనారాయణునిగా కొలువైన ఈ క్షేత్రం వైకుంఠ సమానంగా పరిగణించబడుతుంది. 'న భూతో న భవిష్యతి' అన్నట్లుగా బద్రీనాథ్ వంటి క్షేత్రం ముల్లోకాలలో లేదని పద్మ పురాణం కీర్తించింది. అలకనంద నది తీరాన ఉన్న ఈ ఆలయంలో ధ్యాన ముద్రలో ఉన్న విష్ణువును దర్శించడం ద్వారా యాత్ర పరిపూర్ణమవుతుంది. ఈ నాలుగు క్షేత్రాల సందర్శన అనేది ప్రకృతిలోని పంచభూతాలను, దైవత్వాన్ని ఏకకాలంలో అనుభవించే అవకాశం కల్పిస్తుంది.

గణాంకాల పరంగా చూస్తే, చార్ ధాం యాత్ర యొక్క ప్రజాదరణ ఏటా పెరుగుతూనే ఉంది. శీతాకాలంలో హిమాలయాలు మంచుతో కప్పబడి ఉండటం వల్ల ఏప్రిల్/మే నెలల్లో అక్షయ తృతీయ నాడు ఈ ఆలయాల తలుపులు తెరుచుకుంటాయి మరియు నవంబర్ మొదటి వారంలో దీపావళి తర్వాత మూసివేయబడతాయి. ఉత్తరాఖండ్ పర్యాటక శాఖ గణాంకాల ప్రకారం, 2022లో సుమారు 46 లక్షల మంది, 2023లో ఏకంగా 50 లక్షలకు పైగా యాత్రికులు ఈ క్షేత్రాలను సందర్శించి రికార్డు సృష్టించారు. 2024 మరియు తదుపరి సంవత్సరాల్లో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అంచనా. యాత్రికుల సంఖ్య పెరగడం అనేది ఒకవైపు ఆధ్యాత్మిక చైతన్యాన్ని సూచిస్తుండగా, మరోవైపు ఈ సున్నితమైన హిమాలయాల పర్యావరణంపై పడుతున్న ఒత్తిడిని కూడా గుర్తుచేస్తోంది.

ఈ యాత్ర అనేక సవాళ్లతో కూడుకున్నది. 2013 జూన్ మాసంలో సంభవించిన కేదార్‌నాథ్ వరదలు ఒక తీరని జ్ఞాపకంగా మిగిలిపోయాయి. మేఘ విస్ఫోటనం కారణంగా చొరబడిన వరద నీరు వేలాది మంది ప్రాణాలను బలిగొనడమే కాకుండా, యాత్ర మౌలిక సదుపాయాలను ఛిన్నాభిన్నం చేసింది. ఆ విపత్తు తర్వాత ప్రభుత్వం మేల్కొని యాత్ర భద్రతలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చింది. ప్రస్తుతం 'చార్ ధాం ఆల్ వెదర్ రోడ్ ప్రాజెక్ట్' ద్వారా సుమారు 889 కిలోమీటర్ల పొడవైన రహదారిని అన్ని కాలాల్లో ప్రయాణానికి వీలుగా అభివృద్ధి చేస్తున్నారు. ఇది కేవలం ప్రయాణ సమయాన్ని తగ్గించడమే కాకుండా, ప్రమాదాల తీవ్రతను కూడా తగ్గిస్తుంది. దీనితో పాటు, రిజిస్ట్రేషన్ ప్రక్రియను డిజిటలైజ్ చేయడం, ప్రతి యాత్రికుడికి రియల్ టైమ్ ట్రాకింగ్ సౌకర్యం కల్పించడం వంటి చర్యలు భద్రతను మెరుగుపరిచాయి.

ఆర్థికంగా చార్ ధాం యాత్ర ఉత్తరాఖండ్ రాష్ట్రానికి వెన్నెముక వంటిది. ఈ ఆరు నెలల యాత్ర కాలంలోనే రాష్ట్ర జిడిపిలో గణనీయమైన భాగం పర్యాటక రంగం నుండి వస్తుంది. హోటల్ యజమానులు, రవాణా సంస్థలు, గుర్రాల యజమానులు, స్థానిక గైడ్‌లు మరియు చిరు వ్యాపారులకు ఇది ప్రధాన జీవనోపాధి. వేలాది కోట్ల రూపాయల ఆర్థిక లావాదేవీలు ఈ యాత్ర చుట్టూ తిరుగుతుంటాయి. అయితే, ఈ వాణిజ్యపరమైన ఎదుగుదల ప్రకృతి పర్యావరణానికి ముప్పు కాకూడదనే ఉద్దేశంతో 'పర్యావరణ అనుకూల యాత్ర' (ఇఇనీ-టతీతివనిటశ్రీఎ జజీబితీజీ) పై చర్చలు జరుగుతున్నాయి. ప్లాస్టిక్ నియంత్రణ, చెత్త నిర్వహణ మరియు హిమాలయ గ్లేసియర్ల రక్షణ ఇప్పుడు అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశాలుగా మారాయి.

ఆధునిక సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో ఇప్పుడు యాత్ర స్వరూపం మారుతోంది. గతంలో కాలినడకన నెలల తరబడి సాగే ఈ ప్రయాణం, నేడు హెలికాప్టర్ సర్వీసుల ద్వారా నిమిషాల్లో ముగుస్తోంది. అయినప్పటికీ, భక్తులలో భక్తి భావం ఏమాత్రం తగ్గలేదు. కేదార్‌నాథ్ వెళ్ళే దారిలో 16 కిలోమీటర్ల కఠినమైన కొండ మార్గంలో నడిచే వృద్ధులు, వికలాంగులను చూస్తే భక్తి శక్తి ఏమిటో అర్థమవుతుంది. చలిని తట్టుకుంటూ, ఆక్సిజన్ తక్కువగా ఉండే ఎత్తైన ప్రదేశాలలో వారు ప్రదర్శించే పట్టుదల మానవ మనోబలానికి నిదర్శనం. యాత్రలో ఎదురయ్యే శారీరక కష్టం మనలోని అహంకారాన్ని కరిగించి, వినయాన్ని ప్రసాదిస్తుంది.

ముగింపుగా చెప్పాలంటే, చార్ ధాం యాత్ర అనేది కేవలం దర్శనీయ స్థలాల సందర్శన కాదు. అది భారతీయుల సాంస్కృతిక వారసత్వం, భక్తి వైరాగ్యాల సంగమం. హిమాలయాల శిఖరాల నుంచి ప్రవహించే నదులు, చలి గాలుల మధ్య వినిపించే 'ఓం నమః శివాయ' మరియు 'ఓం నమో నారాయణాయ' మంత్రోచ్చారణలు మనిషికి మానసిక ప్రశాంతతను అందిస్తాయి. ఆధునికత పెరుగుతున్న కొద్దీ యాత్ర సౌకర్యవంతంగా మారవచ్చు కానీ, ఆ హిమాలయాల పవిత్రత, భక్తుల ఆర్తి ఎప్పటికీ అలాగే ఉంటాయి. భవిష్యత్ తరాలకు ఈ ఆధ్యాత్మిక సంపదను అందించడం కోసం పర్యావరణాన్ని కాపాడుకుంటూ, ఈ పవిత్ర యజ్ఞాన్ని కొనసాగించవలసిన బాధ్యత మనందరిపై ఉంది. చార్ ధాం యాత్ర అంటే మనిషి తనను తాను తెలుసుకోవడం మరియు పరమాత్మలో లీనమవ్వడం కోసం చేసే ఒక మహోత్కృష్ట ప్రయత్నం. ఈ ప్రయాణం ముగిసే సమయానికి ప్రతి యాత్రికుడు తనతో పాటు కేవలం జ్ఞాపకాలను మాత్రమే కాదు, ఒక కొత్త దృక్పథాన్ని, ఆత్మవిశ్వాసాన్ని ఇంటికి తీసుకువెళతాడు.



-రామ కిష్టయ్య సంగన భట్ల,
9440595494

## ఇంటర్ ఫలితాల్లో మైనారిటీ గురుకుల విద్యార్థులకు మెరుగైన ఫలితాలు

### -మైనార్టీ గురుకుల కళాశాలను విద్యార్థినీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి...
### -మైనార్టీ గురుకుల కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పడిశెట్టి సంపత్...

కరీంనగర్, ఏప్రిల్ 20:(నేటినిజం ప్రతినిధి) తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించిన 2026 విద్య సంవత్సరానికి సంబందించిన ప్రథమ , ద్వీతీయ సంవత్సర ఫలితాల్లో మైనారిటీ గురుకుల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని తెలంగాణ మైనారిటీ గురుకుల కళాశాల మానకొండూర్ బాలుర -1 ప్రిన్సిపాల్ డాక్టర్ పిడిశెట్టి సంపత్ తెలిపారు. ఎంపీసీ / బైపీసీ విభాగంలో హుజురాబాద్ బాలుర కళాశాలలో ద్వీతీయ సంవత్సరంలో ఎన్.రాజకుమార్ స్వామి 948 /1000 , అంజన్న 900 /1000 ఎం.రాహుల్ 916 /1000 , శ్రీనాథ్ రెడ్డి 913 / 1000 అలాగే ప్రథమ సంవత్సరంలో మొహమ్మద్ హనీఫ్ 447 /470 , మొహమ్మద్ సమీర్ 445 / 470 , షేర్ ఖాన్ 431 /440 , పి.రోహిత్ 431 / 440 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ కుమారస్వామి తెలిపారు. ఆర్ట్స్ విభాగంలో మానకొండూర్ బాలుర కళాశాలలో ప్రథమ సంవత్సరంలో మనోజ్ 460 /500 , ఎండీ. రెహాన్ 446 /500 , రాజేష్ 442 /500 , ఎం.సాగర్ 433 /500 ద్వీతీయ సంవత్సరంలో ఎండీ. అష్రాఫ్ 866 /1000 , సి.హెచ్ చందు 857 /1000 , డి.అభిషేక్ 828 /1000 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ పిడిశెట్టి సంపత్ తెలిపారు. అదేవిధంగా బాలికల కళాశాలల్లో కరీంనగర్ గర్ల్స్ -2 ఎంపీసీ / బైపీసీ విభాగంలో ద్వీతీయ సంవత్సరంలో తబస్సుమ్ లారా 988 /1000 ,అఫ్రీన్ ఫాతిమా 982 /1000, సాజిదా 981 /1000 ఆలాగే 900 పైగా మార్కులు సాధించిన విద్యార్థులు సంఖ్య గణనీయంగా ఉన్నారని ప్రథమ సంవత్సరంలో అలీజా మరియం 459 /470 , మెహరోజ్ తంకీన్ 458 /470 , షైక్ సుహానా 450 /470 లతో 400 పైగా మార్కులు సాధించిన వారు 30 మంది ఉన్నారని ప్రిన్సిపాల్ ఎన్. సరిత ఈ సందర్భంగా తెలిపారు. ఆర్ట్స్ విభాగంలో చొప్పదండి బాలికల కళాశాలలో ద్వీతీయ సంవత్సరంలో జాస్మిన్ 965 / 1000 , మౌనిక 959 /1000 , పావని 957 / 1000 , శీరీన్ 950 /1000 , రుత్విక 933 / 1000 మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ జి.వారుణీ తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ పిడిశెట్టి సంపత్ మాట్లాడుతూ విద్యార్థులు కృషి , ఉపాధ్యాయుల అంకితభావం, క్రమశిక్షణతో కూడిన విద్య విధానం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని తెలిపారు. మైనారిటీ గురుకులాల కో ఆర్డినేటర్ రమేష్ లాల్ హత్కర్, విజిలెన్సు అధికారులు ఎం.డి . అక్రమ్ పాషా, ఇంతియాజ్ అలీ , అకాడమిక్ కో ఆర్డినేటర్ ఎం.డి మిరాజ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులను అభినందించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , మైనారిటీ గురుకులాల సొసైటీ అధ్యక్షులు ఫహీమ్ ఖురేషి, సెక్రటరీ బి. షఫీఉల్లా , డి.ఐ.ఓ సుభాన్ లకు ప్రిన్సిపాళ్లు కృతజ్ఞతలు తెలిపారు.మైనారిటీ గురుకులాల్లో ప్రవేశాలు కొనసాగుతున్నాయని ఇట్టి అవకాశాన్ని మైనారిటీలు వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 7995057932 కు సంప్రదించాలని కోరారు.



Dr.Pidishetti Sampath, Principal

## లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం..




కరీంనగర్, ఏప్రిల్ 20: (నేటినిజం ప్రతినిధి) లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో కరీంనగర్ పట్టణం భాగ్యనగర్, న్యూ లేబర్ అడ్డాలో గల హరిహర క్లినిక్ వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా బిపి, షుగర్ పరీక్షలను , నిర్వహించి అవసరమైన వైద్య సలహాలు, సూచనలు అందజేశారు. డా. రవికాంత్, ఫిజీషియన్ పర్యవేక్షణలో టెక్నీషియన్ జి. రవికుమార్ ల పర్యవేక్షణలో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. క్లబ్ ప్రెసిడెంట్ లయన్ డి. తిరుపతి రెడ్డి, సెక్రటరీ జి. చంద్రశేఖర్, లయన్ ఇ. రమేష్, జిఎల్‌టి కోఆర్డినేటర్ లయన్ ఎం. సత్యనారాయణ రావు పిఆర్‌సి, లయన్ ఎస్. మనోహర చారి పిపి, లయన్ ఎం. మహేందర్ విపి, లయన్ ఎస్. తిరుపతి, లయన్ ఇ. రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మసీదులు, ఖబ్రస్థాన్ పనులపై అనుమానాలు

### -విచారణకు కలెక్టర్‌కు వినతి

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 20: (నేటినిజం ప్రతినిధి): వక్ఫ్ బోర్డు-మైనార్టీ శాఖ ద్వారా సిరిసిల్ల పట్టణంలో మసీదులు, ఖబ్రస్థాన్ అభివృద్ధి పనుల కోసం మంజూరు చేసిన నిధుల వినియోగంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపించాలని స్థానికుడు మహ్మద్ అబ్దుల్ మోసిన్ జిల్లా కలెక్టర్‌ను కోరారు. 2018 ఏప్రిల్ 18న జి.ఓ.ఆర్.టి. నెం.101 ప్రకారం ఖబ్రస్థాన్ కాంపౌండ్ వాల్, మసీదుల మరమ్మతులు, షాదీఖాన నిర్మాణానికి నిధులు విడుదల చేసి, పనుల బాధ్యతను పంచాయతీరాజ్ శాఖకుఅప్పగించినట్లు తెలిపారు. అయితే సిరిసిల్ల పట్టణానికి చెందిన మొహమ్మదీయ మసీదు (చంద్రంపేట) రూ.3 లక్షలు, ఖబ్రస్థాన్ కాంపౌండ్ వాల్ రూ.20 లక్షలు, జామ మసీదు రూ.4 లక్షలు, మక్కా మసీదు రూ.4 లక్షల పనులు ఇప్పటివరకు ప్రారంభం కాలేదని పేర్కొన్నారు. ఈ పనులకు టెండర్లు పిలవలేదని, 2021లోనే గ్రాంట్ అందినా అమలు జరగలేదని తెలిపారు. అధికారులను పలుమార్లు సంప్రదించినా స్పందన లేకపోవడంతో పాటు, కొన్ని పనులు చేయకుండానే బిల్లులు తీసుకున్నట్లు సమాచారం ఉందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో నిధుల వినియోగంపై పూర్తి స్థాయి విచారణ జరిపించి, మిగిలిన పనులను తక్షణమే ప్రారంభించి పూర్తి చేయాలని కలెక్టర్‌ను విజ్ఞప్తి చేశారు.

## బసవ జయంతి సందర్భంగా జగద్గురు బసవేశ్వరకు శ్రద్ధాంజలి ఘటించిన ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20:బసవ జయంతి సందర్భంగా జగద్గురు బసవేశ్వరకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ శ్రద్ధాంజలి ఘటించారు.బసవ జయంతి విశిష్ట సందర్భంగా జగద్గురు బసవేశ్వరకూ, కలకాలం నిలిచి ఉండే ఆయన బోధనలకూ శ్రద్ధాంజలి ఘటిస్తున్నానని శ్రీ మోదీ అన్నారు. సమాజాన్ని న్యాయ పూర్ణమైందిగా తీర్చిదిద్దాలని బసవేశ్వర తపించారనీ, ప్రజలకు సాధికారతను కల్పించడానికి అవిరామ కృషి చేశారనీ, ఇవి మనకు సదా స్ఫూర్తినిస్తాయనీ ప్రధాని అన్నారు.

సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ప్రధానమంత్రి ఒక సందేశాన్ని పొందుపరుస్తూ -

''బసవ జయంతి విశిష్ట సందర్భంగా, జగద్గురు బసవేశ్వరకూ, కలకాలం నిలిచి ఉండే ఆయన బోధనలకూ శ్రద్ధాంజలి ఘటిస్తున్నాను.

## హిమాలయ బేబీకేర్ నుంచి కొత్త డివిసి (డైలీ వీడియో క్యాంపెయిన్) ప్రారంభం

హైదరాబాద్, ఏప్రిల్ 20: భారత్ లో అత్యంత విశ్వసనీయమైన బేబీ కేర్ బ్రాండ్‌లలో ఒకటైన, శిశువులకు ఎంతో ఇష్టమైన హిమాలయా బేబీ కేర్, హిమాలయా బేబీ మసాజ్ ఆయిల్ కోసం ఒక కొత్త డీవీసీని ఆవిష్కరించింది. ఇది బాల్యదశపై నూతన దృక్పథాన్ని ఆవిష్కరిస్తూ, శిశువుగా ఉండటం కనిపించే దానికంటే మరింత సవాళ్లతో కూడుకున్నదని తల్లిదండ్రులకు గుర్తు చేస్తుంది.




శిశువుల కోణం నుంచి ఆలోచింపచేసేలా ఉంటుందీ వీడియో. శిశువే తాను ఎదగడానికి కావలిసిన క్రుషిని పట్టి చూపుతుంది. పెద్దల ఆలోచనా విధానంలో శిశువులు రోజంతా ఎంత విశ్రాంతిగా ఉంటారో నవ్వుతూ చెబుతుంటారు. నిజానికి వారి బిజీ దినచర్యను?అంటే తమ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని గమనించడం, కొత్త విషయాలు నేర్చుకోవడం, బరువు పెరగడం, ఇంకా వారి మొదటి పళ్ళు రావడం వంటివాటిని?హాస్యభరితంగా హైలైట్ చేశారు. ఈ సరదా కథనం ద్వారా, పసిపిల్లలకు పెరగడం అనేది ఒక పూర్తికాలపు ఉద్యోగం అనే భావనను ఈ చిత్రం తెలియజేస్తుంది.

అశ్వగంధ, బాల వంటి సహజ పదార్థాలతో సమ్మిళితమైన ఈ బేబీ మసాజ్ ఆయిల్ ఈ ప్రచారంలో ప్రధానాంశంగా కనిపిస్తుంది. ఈ రెండు పదార్థాలు సహజంగానే శిశువులకు మరింత బలాన్ని చేకూర్చుతూ, సంపూర్ణ ఆరోగ్యాన్ని కూడా అందిస్తాయి. రోజువారీ దినచర్యలో భాగంగా శిశువులకు మర్దన అత్యంత ముఖ్యమైనది అని తెలియజెప్పేలా ఉంటుందీ వీడియో. ఇది శిశువుల ఎదుగుదలకు ప్రారంభం నుంచే కీలకమైన పాత్ర పోషిస్తుందని తెలియజెప్పేలా కూడా ఉంటుంది.

## బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే

### – జిల్లా ఎస్పీ మహేష్ బి గితే

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 20:(నేటినిజం ప్రతినిధి): ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 22 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్‌లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.



## డంపింగ్ యార్డుతో పరిసర ప్రాంతాల ప్రజల దుర్భర జీవితం

### -కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్
### – నిరసనలు, రాస్తారోకోలతో ఉద్యమానికి పిలుపు



కరీంనగర్, ఏప్రిల్ 20: (నేటినిజం ప్రతినిధి) : హుజురాబాద్ శివారులో డంపింగ్ యార్డు ఏర్పాటు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బీజేపీ ఉద్యమానికి సిద్ధమైంది. నిరసనలు, రాస్తారోకోలు, ధర్నాలు, దీక్షలతో పోరాటాన్ని తీవ్రతరం చేయాలని నిర్ణయించింది. ప్రభుత్వం వెనక్కి తగ్గేదాకా ఆందోళనలు కొనసాగించాలని శ్రేణులకు పిలుపునిచ్చింది. కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌తో హుజూరాబాద్ నేతలు సమావేశమయ్యారు. జిల్లా అధ్యక్షుడు గంగాడి క్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ భేటీలో డంపింగ్ యార్డు ఏర్పాటుతో ప్రజలు ఆందోళనలో ఉన్నారని వివరించారు. డంపింగ్ యార్డు వల్ల పరిసర ప్రాంతాల ప్రజల జీవనం దుర్భరమవుతుందని బండి సంజయ్ అన్నారు. ఆరోగ్య సమస్యలు పెరిగే ప్రమాదం ఉందని, యువతకు పెళ్లి సంబంధాలు కూడా ప్రభావితమవుతాయని తెలిపారు. కరీంనగర్ డంపింగ్ యార్డు ప్రాంత ప్రజల పరిస్థితి చూసిన అనుభవంతో హుజూరాబాద్‌లో అలాంటి పరిస్థితి రాకూడదన్నారు. ప్రజల ఆందోళన సమంజసమని పేర్కొంటూ, పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధం కావాలని సూచించారు. అవసమైతే న్యాయపోరాటానికి కూడా సిద్ధంగా ఉండాలని చెప్పారు. రేపు హుజూరాబాద్‌లో పార్టీ ముఖ్య నేతల సమావేశం నిర్వహించి ఉద్యమ కార్యాచరణ ఖరారు చేయనున్నారు. అదే రోజు నిరసన కార్యక్రమాలు చేపట్టి, అనంతరం కలెక్టరేట్ వద్ద భారీ దీక్ష చేపట్టాలని నిర్ణయించారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**